ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శుక్రవారం 5 ఏప్రిల్ 2024




శింగరకొండ వ్యూ, భవనాసి చెరువు

రెడ్డిరాజుల రాజధాని..

అద్దంకి

చారిత్రక ప్రసిద్ధి.. సాహిత్యపరంగా ప్రత్యేక గుర్తింపు.. రెడ్డి రాజుల రాజధాని.. అద్దంకి ఎంతో విశిష్టతను సంతరించుకుంది. తొలి తెలుగు పద్య శాసనం అద్దంకిలోనే దొరికింది. 1955లో అద్దంకి నియోజకవర్గం ఏర్పడగా ఇప్పటి వరకు 14 సార్లు ఎన్నికలు జరగాయి. నియోజకవర్గ ఓటర్లు అన్ని పార్టీలను ఆదరించారు. ఉద్దండులు శాసనసభ్యులుగా గెలిచి అసెంబ్లీలోకి అడుగుపెట్టినా ఇంతవరకు ఏ ఒక్కరికి కూడా మంత్రిగా అవకాశం దక్కలేదు. 2009 నుంచి వరుసగా గొట్టిపాటి రవికుమార్ ఇక్కడి నుంచి మూడు సార్లు మూడు పార్టీల తరపున పోటీ చేసి విజయం సాధించి నాలుగో సారి అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఆయనకు ప్రత్యర్థిగా వైసీపీ నుంచి పాణెం చినహనిమిరెడ్డి బరిలో ఉన్నారు.


అద్దంకిలోని కమలేశ్వరస్వామి దేవాలయం వద్ద తొలి తెలుగు పద్య శాసనం (ప్రతికృతి)


అద్దంకిలో కనుమరుగవుతూ కొద్దిమేర మిగిలి ఉన్న రెడ్డి రాజుల కాలం నాటి కోట కొట్ట

- చారిత్రక, సాహిత్యపరంగా ఎంతో ప్రసిద్ధి
- అన్ని పార్టీలను ఆదరించిన ఇక్కడి ఓటర్లు

నియోజకవర్గ ముఖచిత్రం



అద్దంకి, ఏప్రిల్ 4: స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రారంభంలో అద్దంకి ప్రాంతం గుంటూరు జిల్లాలో భాగంగా ఉన్న ఒంగోలు అసెంబ్లీ పరిధిలో ఉంది. మండల వ్యవస్థ వచ్చే వరకు అద్దంకి తాలుకా కేంద్రంగా ఉంది. ఎందరో ఉద్దండులు ఎమ్మెల్యేలుగా ఉన్నా ఇంతవరకు ఏ ఒక్కరికి కూడా మంత్రిగా అవకాశం దక్కలేదు. 1955లో అద్దంకి నియోజకవర్గం ఏర్పడింది. 2009 వరకు నియోజకవర్గంలో 12 మండలాలు ఉండేవి. 2009 పునర్విభజన తర్వాత అద్దంకి, జె.పంగులూరు, కొరిశపాడు, సంతమాగులూరు, బల్లికురవ మండలాలకు పరిమితమైంది. ప్రస్తుతం అద్దంకి మున్సిపాలిటీతో పాటు ఐదు మండలాలు ఈ నియోజకర్గంలో ఉన్నాయి. బాచిన చెంచుగరటయ్య ఏడుసార్లు పోటీ చేసి నాలుగుసార్లు విజయం సాధించారు. కరణం బలరామకృష్ణమూర్తి నాలుగుసార్లు పోటీ చేసి రెండు సార్లు గెలుపొందారు. గొట్టిపాటి రవికుమార్ తొలుత కాంగ్రెస్, అనంతరం వైసీపీ, ఆ తర్వాత టీడీపీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుతం టీడీపీ తరపున బరిలో నిలిచారు. 2014లో వైసీపీ తరపున పోటీ చేసి గెలుపొంది అనంతరం టీడీపీలో చేరారు. రాష్ట్రంలో 2014లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ తరపున గెలిచి టీడీపీలో చేరిన ఎమ్మెల్యేల్లో గెలిచింది గొట్టిపాటి రవికుమార్ ఒక్కరే. మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య కుమారుడు కృష్ణచైతన్య ఇటీవల వరకు అద్దంకి వైసీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. అయితే ఆ పార్టీ టికెట్‌ను పాణెం చినహనిమిరెడ్డికి కేటాయించడంతో బాచిన టీడీపీలో చేరారు.

ఎన్నో ప్రత్యేకతలు

అద్దంకి ప్రాంతానికి చారిత్రక, సాహిత్యపరంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. క్రీ.శ 1325లో రెడ్డిరాజులు అద్దంకి కేంద్రంగా పాలన సాగించారు. రెడ్డి రాజుల కాలంలో అద్దంకిలో మట్టి కోటను నిర్మించారు. అనంతరం రాజధానిని కొండవీడుకు మార్చారు. కాలక్రమంలో కోట కట్ట శిథిలమై ప్రస్తుతం కొద్దిమేర మట్టి గోడలా మిగిలి ఉంది. తొలి తెలుగు పద్య శాసనం అద్దంకిలో దొరికింది. ఆ శాసనంను చెన్నై మ్యూజియంకు తరలించగా ఇటీవల పలుసాహితీ సంస్థల ప్రతినిధులు తొలి తెలుగు పద్యశాసనం మోడల్ తయారు చేయించి అద్దంకిలోని కమలేశ్వర స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేశారు. కవి త్రయంలో ఒకరైన ఎర్రా ప్రగడ భారతంను అద్దంకి గడ్డపైనే పూర్తి చేశారు. ఇక్కడ వేయిస్తంభాల గుడి ఉంది. గాడిద శాసనం, విక్టోరియా మహారాణి విగ్రహాలు, రాణిగారి సత్రం శిథిలావస్థకు చేరాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్న శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాలు అద్దంకి సమీపంలో ఉన్నాయి. శింగరకొండ వద్ద 1918లో భవనాసి చెరువు నిర్మాణం జరిగింది. టంగుటూరి ప్రకాశంపంతులు ప్రాథమిక విద్యాభ్యాసం కొంతకాలం అద్దంకిలోని మేనమామ ఇంటి వద్ద జరిగింది. అద్దంకి పట్టణంలో పలుసాహితీ సంస్థలు ఉన్నాయి. తరచూ సాహితీ సమావేశాలు నిర్వహిస్తూ కొత్తతరం కవులను ప్రోత్సహిస్తుంటారు. అద్దంకి ఇటుకకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకత ఉంది. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నుంచి అద్దంకి ప్రాంతంలోకి సాగర్ నీరు వచ్చిన తరువాత అత్యధిక గ్రామాలు సస్యశ్యామలంగా మారాయి. అత్యధిక గ్రామాలకు తాగునీటి సమస్య తీరింది. అద్దంకి పట్టణం వెంబడిగా గుండ్లకమ్మ నది ప్రవహిస్తుంది.

సం.	విజేత	పార్టీ	ఓటమి	పార్టీ	మెజార్టీ
1955	నాగినేని వెంకయ్య	కృషికార్ లోక్‌పార్టీ	పాటిబండ్ల రంగనాయకులు	సీపీఐ	6,828
1962	పాటిబండ్ల రంగనాయకులు	సీపీఐ	బాచిన అప్పారావు	కాంగ్రెస్	3,772
1967	దాసరి ప్రకాశం	కాంగ్రెస్	నాగినేని వెంకయ్య	స్వతంత్ర పార్టీ	2,068
1972	దాసరి ప్రకాశం	కాంగ్రెస్	నర్రా సుబ్బారావు	స్వతంత్ర	9,082
1978	కరణం బలరామకృష్ణమూర్తి	కాంగ్రెస్	బాచిన చెంచుగరటయ్య	జనతా	5,150
1983	బాచిన చెంచుగరటయ్య	టీడీపీ	కరణం బలరామకృష్ణమూర్తి	కాంగ్రెస్	3,394
1985	బాచిన చెంచుగరటయ్య	టీడీపీ	జాగర్లమూడి హనుమయ్య	కాంగ్రెస్	5560
1989	జాగర్లమూడి రాఘవరావు	కాంగ్రెస్	బాచిన చెంచుగరటయ్య	టీడీపీ	7082
1994	బాచిన చెంచుగరటయ్య	ఇండిపెండెంట్	జాగర్లమూడి రాఘవరావు	కాంగ్రెస్	7049
1999	బాచిన చెంచుగరటయ్య	టీడీపీ	జాగర్లమూడి రాఘవరావు	కాంగ్రెస్	249
2004	కరణం బలరామకృష్ణమూర్తి	టీడీపీ	జాగర్లమూడి రాఘవరావు	కాంగ్రెస్	2790
2009	గొట్టిపాటి రవికుమార్	కాంగ్రెస్	కరణం బలరామకృష్ణమూర్తి	టీడీపీ	15,764
2014	గొట్టిపాటి రవికుమార్	వైసీపీ	కరణం వెంకటేష్	టీడీపీ	4,235
2019	గొట్టిపాటి రవికుమార్	టీడీపీ	బాచిన చెంచుగరటయ్య	వైసీపీ	12,747



కులాల వారీగా ఓటర్లు

కమ్మ	47.000	విశ్వబ్రాహ్మణ	2,500
మాదిగ	33,000	కుమ్మరి	3,000
మాల	22,500	బ్రాహ్మణ	2,000
వడ్డెర	16,500	ముత్తరాసి	1700
యాదవ	19,000	దూదేకుల	2,000
ముస్లిం	15,000	వెలమ	1800
రెడి	16,000	పద్మశాలి	1500
కాపు	14,000	గౌడ	1300
రజక	9,000	బట్రాజులు	1100
వైశ్య	7,700	జంగం	650
యానాది	5,500	బోయ	600
ఎరుకుల	4,000	లంబాడి	850
నాయీబ్రాహ్మణ	4,000	చెంచులు	300

మొత్తం ఓటర్లు	2,41,081
పురుషులు	1,18,159
మహిళలు	1,22,910
ఇతరులు	12

బాధ్యతలు స్వీకరించారు

- గుంటూరు ఐజీగా సర్వశ్రేష్ఠత్రిపాఠి..
- పల్నాడు ఎస్పీగా బిందుమాధవ్..


గుంటూరు రేంజ్ ఐజీగా బాధ్యతలు స్వీకరిస్తున్న సర్వశ్రేష్ఠ త్రిపాఠి

గుంటూరు, నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 4: ఎన్నికల సంఘం ఆదేశాల నేప థ్యంలో గుంటూరు ఐజీ, పల్నాడు ఎస్పీలపై బదిలీ వేటువేసిన వారి స్థానంలో నియమితులైన అధికా రులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు రేంజ్ ఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీగా గరికపాటి బిందుమాధవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిం ది. వీరు వెంటనే విధుల్లో చేరాల్సిందిగా ఆదేశించగా ఆ ప్రకారం వారు బాధ్యతలు చేపట్టారు. రేంజి ఐజీగా నియమితులైన సర్వ శ్రేష్ఠత్రిపాఠి 2006 బ్యాచ్‌కి చెందిన ఐపీఎస్ అధికారి. ఆయన గతంలో 2016 నుంచి 2018 ఎన్నికల ముందు వరకు గుంటూరు అర్బన్ ఎస్పీగా రెండేళ్ల విధులు నిర్వహించారు. మూడేళ్ల డిప్యూటేషన్ పూర్తి చేసుకుని ఉత్తరప్రదేశ్ నుంచి ఆయన తిరిగి ఏపీకి వచ్చారు. అప్పటి నుంచి ఆయన డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది ఆయనకు ఐజీగా ఉద్యోగోన్నతి లభించింది. సర్వశ్రేష్ఠ త్రిపాఠి రేంజ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనను గుంటూరు ఎస్పీ తుషార్‌డూడీ, ఏఎస్పీలు, డీఎస్పీలు మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతి భద్రతలకు సంబంధించిన వివిద అంశాలను ఎస్పీ తుషార్ డూడీని అడిగి తెలుసుకున్నారు.

- పల్నాడు ఎస్పీగా నియమితులైన గరికపాటి బిందుమాధవ్ 2017లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. తొలుత ఆయన రంపచోడవరం ఓఎస్‌డీగా విధులు నిర్వహించారు. ఆ తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లా సెబ్ ఏఎస్పీగా పని చేశారు. జిల్లాల విభజన అనంతరం ఆయన పల్నాడు జిల్లా ఓఎస్డీగా, ఏఎస్పీగా పని చేశారు. ఆ త ర్వాత ఆ యన ఉద్యోగోన్నతి పొంది గ్రేహౌండ్స్ ఎస్పీగా బదిలీపై వెళ్లారు. ఆ తర్వాత తిరిగి తాజాగా పల్నాడు ఎస్పీగా రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆయనకు జిల్లాపై అవ గాహన ఉండటం వల్ల రానున్న ఎన్నికల నిర్వహణ కొంత సులువు కానుంది. బిందు మాధవ్ నరసరావు పేటలోని ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.



ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేసిన వారే..

గుంటూరు రేంజిలో తాజాగా నియమితులైన నలుగురు ఐపీఎస్ అధికారుల్లో ముగ్గురు గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేసిన వారే కావడం గమనార్హం. ఐజీ సర్వ శ్రేష్ఠత్రిపాఠి 2016 నుంచి 2018 వరకు గుంటూరు అర్బన్ ఎస్పీగా విధులు నిర్వహించారు. పల్నాడు ఎస్పీ గరికపాటి బిందుమాధవ్ ఉమ్మడి గుంటూరు జిల్లా సెబ్ ఏఎస్పీగా పని చేశారు. ఇక నెల్లూరు ఎస్పీగా నియమితులైన ఆరిఫ్‌హఫీజ్ ఉమ్మడి గుంటూరు జిల్లా సెబ్ ఏఎస్పీగా ఏడాదికి పైగా పనిచేశారు. ఆ తర్వాత అర్బన్ ఏఎస్పీగా, గుంటూరు అర్బన్ ఎస్పీగా పని చేశారు. జిల్లాల విభజన తర్వాత గుంటూరు జిల్లా ఎస్పీగా పనిచేశారు. రెండు నెలల క్రితం ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో డీజీపీ కార్యాలయానికి వెళ్లారు. తాజాగా ఆయనను గుంటూరు రేంజి పరిధిలోని నెల్లూరు ఎస్పీగా నియమించారు.

ఎంపీ సీటు.. నాకొద్దు

- పొన్నూరు టికెట్ నాకే ఇవ్వండి
- లేదంటే గుంటూరు పశ్చిమలో అవకాశమివ్వండి
- మంత్రి రజినీని గుంటూరు లోక్‌సభకు పంపండి
- సజ్జలకు మొరపెట్టుకున్న ఎమ్మెల్యే కిలారి రోశయ్య
- ఇప్పటికే కాడి కిందపడేసి పరారైన ఉమ్మారెడ్డి వెంకటరమణ



గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ మాత్రమే వచ్చింది. ఇంకా నోటిఫికేషన్ రాలేదు.. అయితే వైసీపీ అభ్యర్థుల్లో ఓటమి భయం పట్టుకుందా అంటే.. తాజాగా నెలకొంటున్న పరిస్థితులు అవుననంటున్నాయి. గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ ఎంపీ అభ్యర్థిగా రెండో కృష్ణుడుగా పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య రంగప్రవేశం చేశారు. అయితే ఇంకా ఆట మొదలుకాకుండానే ఆయన కాడి కింద పడేశారు. అక్కడి వారిని ఇక్కడకు, ఇక్కడి వారిని అక్కడకు మారుస్తూ సీఎం జగన్ ప్రయోగాలు చేసినప్పటికీ అవి సత్ఫలితాలు ఇవ్వడం లేదు. పొన్నూరు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కిలారి వెంకటరోశయ్య గుంటూరు ఎంపీ అభ్యర్థిగా రాజకీయ బదిలీపై వచ్చారు. తొలుత ఈ సీటుకు రోశయ్య బావమరిది ఉమ్మారెడ్డి వెంకటరమణను ఎంపిక చేశారు. ఆయన రెండు మూడు రోజుల్లోనే తోక ముడిచి నాకొద్దీ సీటంటూ పరారయ్యారు. దీంతో అవాక్కయిన వైసీపీ అధిష్ఠానం అతనికి బదులుగా , అతని బావ రోశయ్యను బరిలోకి దించారు. అభ్యర్థిగా ఖరారు చేసింది కొద్దిరోజుల క్రితమే అయినప్పటికీ ఆయన అయిష్టంగానే అడుగులు వేస్తున్నారు. ఇందుకు ప్రధానకారణం అధిష్ఠానం సూచించినంత మొత్తం ఆయన వద్ద లేకపోవడమేనని సమాచారం. ఈ పరిస్థితుల్లో ఆయన బుధవారం తన మామ, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డిలతో కలిసి వెళ్లి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఎదుట తన గోడు వెళ్లగక్కినట్లు తెలిసింది. తాను ఎంపీగా పోటీ చేయలేనని, ఎంపీగా పోటీ చేసే ఆర్థిక స్థితి తనకు లేదని రోశయ్య సజ్జలకు విన్నవించినట్లు తెలిసింది. తన వద్ద ఎమ్మెల్యే ఎన్నికలకు పోటీ చేసేంత ఆర్థిక స్తోమత మాత్రమే ఉందని, అందువల్ల తనకు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పొన్నూరు సీటునే తిరిగి ఇవ్వాలని మొరపెట్టు కున్నట్లు తెలిసింది. అది వీలు కాని పక్షంలో గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరినట్లు సమాచారం. గుంటూరు పశ్చిమలో తన సామాజికవర్గం ఓటర్లు కూడా ఎక్కువగా ఉన్నారని వివరించినట్లు తెలిసింది. చిలకలూరిపేట నుంచి ఇక్కడకు వలస వచ్చిన విడదల రజినీని గుంటూరు ఎంపీగా బరిలోకి దించాలని కూడా రోశయ్య సూచించినట్లు సమాచారం. అయితే ఈ సమయంలో మార్పులు చేయడం అంతసులువు కాదని, ఇప్పుడే తొందరపడి ఎటువంటి ప్రకటనలు చేయవద్దని సజ్జల వారికి హితవు చెప్పినట్లు తెలి సింది. ఉగాది పండుగ వరకు ఆగమ ని ఆ తర్వాత కొద్దిపాటి మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉందని చెప్పారు. ఈలోగా సీఎం జగన్‌తో మాట్లాడి ఏ విషయం చెబుతా నని రోశయ్యను అను నయించినట్లు తెలిసింది.

వైసీపీకి గుడ్‌బై

- అధిష్ఠానానికి ఆమంచి షాక్
- 9న భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని లేఖ
- 11న కాంగ్రెస్ పార్టీలో చేరికపై అనుచరులకు సమాచారం


ఆమంచి కృష్ణమోహన్

చీరాల, ఏప్రిల్ 4: వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు, ఈ నెల 9న భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 11వ తేది కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు అనుచరులకు ఆయన సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. వేటపాలెం మండలం పందిళ్లపల్లిలోని తన నివాసంలో గురువారం ఆమంచి ముఖ్యఅనుచరులతో భేటీ అయ్యారు. ఇందులో వైసీపీకి రాజీనామా, కాంగ్రెస్ పార్టీలో చేరికపై నిర్ణయాలు ప్రకటించినట్లు సమాచారం. గతంలో నవోదయం పార్టీ(ఆటో గుర్తు)పై ఇండిపెండెంట్‌గా పోటీ చేశామని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, అన్ని కోణాల్లో ఆలోచించి కాంగ్రెస్ పార్టీలో చేరటం మంచిదని ఆయన వివరించగా అనుచరులు సమ్మతించినట్లు తెలిసింది.

అధిష్ఠానం కన్నా.. ఆమంచే ముందు

వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కొంతకాలంగా వేస్తున్న అడుగులు అధిష్ఠానం నిర్ణయాన్ని ధిక్కరించినట్లు ఆ పార్టీ పెద్దలు భావిస్తున్నారు. పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తూ, చీరాల నుంచి పోటీ చేస్తానని అనుచరులకు ఆమంచి చెప్పినప్పటి నుంచి పరిణామాలు చకచకా మారిపోయాయి. ఈ క్రమంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు ఆమంచి పాల్పడుతున్నట్లు అధిష్ఠానం భావించింది. ఆయన చర్యలను కట్టడి చేసేందుకు అధిష్ఠానం మూడు మార్గాలను ఎంచుకున్నట్లు సమాచారం. అందులో భాగంగా ఆమంచిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడం ఒక మార్గం. అయితే అధిష్ఠానం ఆలోచనను ముందుగానే పసిగట్టిన ఆయన తానే ముందస్తు నిర్ణయం తీసుకున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అందులో భాగంగానే వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి, ప్రత్యామ్నాయ ప్రణాళికను రూపొందించుకున్నారని సమాచారం.

పింఛన్లు.. 88 శాతం

- వలంటీర్ల కంటే వేగంగా పంపిణీ
- బెడిసికొట్టిన వైసీపీ ఓట్ల రాజకీయం
- నగదు విడుదల కాకే తొలుత జాప్యం
- అధికార పార్టీ అసత్య ప్రచారాలు పటాపంచలు
- గురువారం మధ్యాహ్నానికే సచివాలయాలు ఖాళీ

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లు లేకపోతే పింఛన్ల పంపిణీ కష్టమని అధికార పార్టీ చేసిన అసత్య ప్రచారాలు పటాపంచలయ్యాయి. గ్రామ/వార్డు సచివాలయాల కార్యదర్శులు వలంటీర్లు చేసే పనిని రోజున్నర వ్యవధిలోనే పూర్తి చేశారు. సచివాలయాలకు పింఛన్‌దారులు వచ్చిందే తడవుగా నిమిషాల వ్యవధిలో వేలిముద్ర ద్వారా ఆధార్ అథెంటికేషన్ చేయించుకుని నగదు చేతిలో పెట్టి పంపించేశారు. దీంతో గురువారం మధ్యాహ్నం నుంచే చాలా సచివాలయాల్లో పింఛన్‌దారులు లేక కౌంటర్లు ఖాళీగా మారాయి. ఇంకా ఎవరైనా పెన్షన్ తీసుకోవాల్సిన వారు ఉంటే వెంటనే రావాలని, సచివాలయాల్లో పలువురు కార్యదర్శులు వాట్సాప్ గ్రూపుల ద్వారా పింఛన్‌దారులకు సందేశాలు పంపించారు. ప్రభుత్వం కనుక రెండు విడతలుగా కాకుండా ఒకే విడతలో నగదు జమ చేసి ఉంటే ఈపాటికి మొత్తం పెన్షన్ల పంపిణీని పూర్తి చేసేవారమని పేర్లు చెప్పడానికి ఇష్టపడని పలువురు సెక్రెటరీలు తెలిపారు. గుంటూరు జిల్లాలో 2,60,830 పింఛన్లను ఈ నెలలో ప్రభుత్వం విడుదల చేయగా గురువారం సాయంత్రానికి 2,14,734 (82.33 శాతం)మందికి పంపిణీ పూర్తిచేశారు. అలానే పల్నాడు జిల్లాలో 2,82,105 మందికి 2,48,970(88.25 శాతం), బాపట్ల జిల్లాలో 2,35,945 మందికి 2,02,814(86.32 శాతం) మందికి పంపిణీని పూర్తిచేశారు. అది కూడా ఎలాంటి చిన్నపాటి సమస్యలు కూడా లేకుండానే. ఇదే పనిని ప్రతీ నెలా వారికి అప్పగించినా పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి ఇచ్చేయగలరు. కాగా వలంటీర్లు లేకపోతే పింఛన్ల వ్యవస్థ కుప్పకూలుతుందని ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూసిన వైసీపీకి పెన్షన్ల పంపిణీ శాతం ఏమాత్రం మింగుడు పడటం లేదు. ఈ నెల, వచ్చే నెలలో పింఛన్‌దారులను ఇబ్బంది పెట్టి ఓట్లు కోసం చేసిన నీచ రాజకీయ వ్యూహం బెడిసికొట్టినట్లు అయింది. పింఛన్ల జాప్యానికి కారణం టీడీపీ, బీజేపీ, జనసేన అని మూడు పార్టీలపై నెపం మోపి లబ్ధి పొందాలని చూసిన వైసీపీ ప్రయత్నం బూమరాంగ్ అయింది.

చాలామంది పింఛన్‌దారులు తాము గతంలో వలంటీర్‌కు రూ.200 ఇవ్వాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ బాధ తప్పిందని సంతోషాన్ని వ్యక్తపరిచారు. కాగా మంచం నుంచి లేవలేని వాళ్లు, దివ్యాంగుల వద్దకు సచివాలయాల కార్యదర్శులే వెళ్లి పెన్షన్‌ని పంపిణీ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని ఓ సచివాలయం వద్దకు వైసీపీ నేత వెళ్లి గురువారం తానే పింఛన్లు పంపిణీ చేస్తానని హడావిడి చేసినట్లు తెలిసింది. అయితే అందుకు సచివాలయ సెక్రెటరీలు అంగీకరించలేదు. దీంతో ఎన్నికల తర్వాత వచ్చేది వైసీపీ ప్రభుత్వమే, ఆ విషయాన్ని గుర్తు పెట్టుకోండి అంటూ వారిని హెచ్చరించినట్లు సమాచారం. తలసేమియా వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న కొరిటపాడుకు చెందిన బాలుడికి ఉన్నతాధికారులు అనుమతిస్తే అక్కడికు వెళ్లి రూ.10 వేల పింఛన్‌ని ఇచ్చేందుకు సంబంధిత సిబ్బంది సన్నద్ధమయ్యారు.


రేపల్లెలో పింఛన్లు పంపిణీచేస్తున్న సచివాలయ సిబ్బంది


దుగ్గిరాలలో పింఛన్లు పంపిణీచేస్తున్న సచివాలయ సిబ్బంది

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(శుక్రవారం)

సహారీ (ఉదయం) 4.43 (శనివారం)

దిక్సూచి DIKSUCHI

ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్‌లో పీహెచ్‌డీ

ఢిల్లీలోని ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీడీ)- పీహెచ్‌డీ 2024(మాన్‌సూన్ సెషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రెగ్యులర్, స్పాన్సర్డ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. స్పాన్సర్డ్ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. వీరు స్పాన్సరింగ్ సర్టిఫికెట్‌ను సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అకడమిక్ మెరిట్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ (ఎస్‌ఓపీ) ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్ ఇస్తారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌కు మాత్రం పీజీక్యాట్ ఎగ్జామ్ ఉంటుంది.

పరిశోధన విభాగాలు: కంప్యూటేషనల్ బయాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్(ఫిలాసఫీ, కమ్యూనికేషన్, గవర్నెన్స్, పాలిటిక్స్), హ్యూమన్ సెంటర్డ్ డిజైన్.

అర్హత: అభ్యర్థులు ఎంచుకొన్న విభాగాన్ని అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లతో ఎంఈ/ఎంటెక్/ఎంఫార్మసీ/ఎండిజైన్/ఎంఎస్/ఎమ్మెస్సీ/ఎంసీఏ/ఎంబీబీఎస్/ఎంస్టాట్/ఎంఫిల్/ఎంఏ/ఎంఎస్‌డబ్ల్యూ/ఎంకాం ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులతో బీఈ/బీటెక్/బీఫార్మసీ/బీడిజైన్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్/యూజీసీ/డీఎస్‌టీ/ఇన్‌స్పయిర్/ఐసీఎంఆర్/డీబీటీ/ఎన్‌బీహెచ్ఎం ఫెలోషిప్ అర్హత తప్పనిసరి. నిర్దేశించిన విభాగాలకు గేట్/జీప్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఫెలోషిప్: రెగ్యులర్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులందరికీ సంస్థ ఫెలోషిప్‌లు అందిస్తుంది. కాంప్రహెన్సివ్ ఎగ్జామ్ పూర్తయ్యేవరకు నెలకు రూ.37,000; తరవాత పీహెచ్‌డీ పూర్తయ్యేవరకు నెలకు రూ.42,000 ఇస్తారు. ప్రతినెలా హెచ్ఆర్ఏ చెల్లిస్తారు. ల్యాప్‌టాప్/డెస్క్‌టాప్ కొనుగోలు నిమిత్తం రూ.50,000; కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.20,000 చెల్లిస్తారు. రీసెర్చ్ వర్క్ నిమిత్తం ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకుగాను ప్రోగ్రామ్ మొత్తమ్మీద రూ.రెండున్నర లక్షలు ఇస్తారు. మూడు నుంచి ఆర్నెల్లపాటు విదేశాల్లో పరిశోధనలు చేసేందుకు 12000 యూఎస్ డాలర్లు చెల్లిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 14
- **ఈసీఈ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 25, 26; మే 10
- **సీఎస్ఈ అభ్యర్థులకు పీజీ క్యాట్ ఎగ్జామ్:** ఏప్రిల్ 28
- **సీఎస్ఈ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు:** మే 2, 3
- **మిగిలిన స్పెషలైజేషన్‌లకు రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** మే 1 నుంచి 13 వరకు
- **వెబ్‌సైట్:** www.iiitd.ac.in



సీఐఎఫ్ఎన్ఈటీలో ట్రేడ్ కోర్సులు

కేంద్ర ఫిషరీస్ విభాగం ఆధ్వర్యంలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజనీరింగ్ ట్రెయినింగ్(సీఐఎఫ్ఎన్ఈటీ)- వెసల్ నావిగేటర్ కోర్సు(వీఎన్‌సీ), మెరైన్ ఫిట్టర్ కోర్సు(ఎంఎఫ్‌సీ)లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇవి ట్రేడ్ కోర్సులు. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. వీటిలో ఫిషింగ్ వెసల్స్‌పై ప్రాక్టికల్ ట్రెయినింగ్ ఉంటుంది. ఎన్‌సీవీటీ క్రాఫ్ట్‌మెన్ ట్రెయినింగ్ స్కీం కింద న్యూఢిల్లీలోని డీజీఈటీ, ఈ కోర్సులను నిర్వహిస్తోంది. ఇవి కొచ్చి, చెన్నై, విశాఖపట్నం క్యాంపస్‌లలో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో క్యాంపస్‌లో వీఎన్‌సీ 20, ఎంఎఫ్‌సీ 20 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్, కౌన్సెలింగ్‌ల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: మేథమెటిక్స్, సైన్స్ ప్రధాన సబ్జెక్టులుగా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 40 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 15 నుంచి 20 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు నిబంధనల ప్రకారం వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

- వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని నింపి నిర్దేశిత పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.350; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.175
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 14
- **టెస్ట్ సెంటర్లు:** కొచ్చి, చెన్నై, విశాఖపట్నం, కోల్‌కతా
- **కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 29
- **ఫలితాలు విడుదల:** జూలై 7
- **కౌన్సెలింగ్:** జూలై 18
- **వెబ్‌సైట్:** www.cifnet.gov.in

జోధ్‌పూర్ ఎయిమ్స్‌లో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్

జోధ్‌పూర్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్- పబ్లిక్ హెల్త్ పాలసీ, లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ 2024(జూలై సెషన్)ని నిర్వహిస్తోంది. హెల్త్, సోషల్ సర్వీసెస్, ఎడ్యుకేషన్, క్లినికల్ రీసెర్చ్, మెడిసిన్, ఫార్మాస్యూటికల్ విభాగాలకు సంబంధించిన కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రైవేటు ఆర్గనైజేషన్లలో కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్న వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఈ ప్రోగ్రామ్‌ని ఉద్దేశించారు. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. మెడికల్ కేటగిరీకి 8, నాన్ మెడికల్ కేటగిరీకి 7, విదేశీ అభ్యర్థుల కేటగిరీకి 5 సీట్లు కేటాయించారు. కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఇందులో భాగంగా రెండు కాంటాక్ట్ సెషన్స్(సెషన్‌కు మూడు రోజులు); 23 వారాలపాటు వెబ్ బేస్డ్ లెర్నింగ్, ప్రాజెక్టు వర్క్ ఉంటాయి.

అర్హత: మెడికల్ కేటగిరీకి ఎంబీబీఎస్/బీడీఎస్/ఆయుష్ డిగ్రీలు పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. నాన్ మెడికల్ కేటగిరీకి కనీసం 55 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ(నర్సింగ్/వెటర్నరీ సైన్స్/ఫిజియోథెరపీ/ఆక్యుపేషనల్ థెరపీ/ఇంజనీరింగ్) లేదా ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పనిచేస్తున్న సంస్థ నుంచి అనుమతి పత్రం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌లను దరఖాస్తుకు జతచేయాలి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రూ.25,000; ప్రైవేట్ ఉద్యోగులకు రూ.1,00,000; విదేశీ అభ్యర్థులకు 1500 యూఎస్ డాలర్లు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 30
- **కోర్సు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.aiimsjodhpur.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/IG4Dkzdలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

కెరీర్‌లో బిగ్గెస్ట్ యాక్షన్ సీక్వెన్స్



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ బేనర్‌పై బన్నీవాసు నిర్మిస్తున్నారు. నిర్మాత అల్లు అరవింద్ సమర్పిస్తున్నారు. శ్రీకాకుళం సాగరతీరం నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నాగచైతన్య యాక్షన్ రోల్‌లో అలరించనున్నారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ గురువారం హైదరాబాద్‌లో మొదలైంది. భారీ ఖర్చుతో నిర్మించిన సెట్‌లో పోరాట ఘట్టాలను దర్శకుడు తెరకెక్కిస్తున్నారు. పలువురు ఫైటర్లు పాల్గొంటున్నారు. 'యానిమల్' చిత్రానికి ఫైట్స్ రూపకల్పన చేసిన సుప్రీం సుందర్ సరికొత్తగా పోరాట ఘట్టాలను తీర్చిదిద్దుతున్నారు. యాక్షన్ సీన్లలో నాగచైతన్యను సరికొత్తగా చూపించబోతున్నారు, ఆయన కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ యాక్షన్ సీక్వెన్స్ అవుతుందని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

ఇదొక ఎక్స్‌ట్రార్డినరీ చిత్రం

నవీన్ యెర్నేని



మలయాళంలో ఘనవిజయం అందుకున్న సర్వైవల్ థ్రిల్లర్ 'మంజుమ్మల్ బాయ్స్'. అక్కడ రూ. 200 కోట్ల రూపాయల వసూళ్లు అందుకుంది. ఈ చిత్రం తెలుగు వెర్షన్‌ను మైత్రీ మూవీ మేకర్స్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. ఈ నెల 6న తెలుగు రాష్ట్రాల్లో విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శకుడు చిదంబరం మాట్లాడుతూ 'మైత్రీ మూవీ మేకర్స్‌కు నా ధన్యవాదాలు. తెలుగు ప్రేక్షకులు మా 'మంజుమ్మల్ బాయ్స్' చిత్రాన్ని ఆదరించాలి. సరికొత్త వినోదాన్ని పంచే చిత్రమిది' అని అన్నారు నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ 'ఇదొక ఎక్స్‌ట్రార్డినరీ ఫిల్మ్. ఈ మధ్యకాలంలో నేను చూసిన గొప్ప చిత్రం కూడా. తెలుగులోనూ పెద్ద విజయాన్ని సాధిస్తుంది. మన ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. యువతను మెప్పించే అన్ని అంశాలూ ఈ చిత్రంలో ఉన్నాయని నటుడు శ్రీనాథ్ భాసి చెప్పారు.

కీర్తన ప్రేమకథ



చిమటా రమేశ్‌బాబు స్వీయ దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న చిత్రం 'నేను-కీర్తన'. రిషిత, మేఘన హీరోయిన్లు. చిమటా లక్ష్మీకుమారి నిర్మాత. ఇటీవలే చిత్రబృందం ఫస్ట్‌లుక్, టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ "నేను-కీర్తన' కొత్త తరహా చిత్రం. ఈ ఏడాది బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో దీనికి స్థానం దక్కుతుందని భావిస్తున్నా. కులు, మనాలీలో చిత్రీకరించిన పాటలు, రేప్ ఫైట్స్ ఈ చిత్రానికి ప్రత్యేకాకర్షణ' అని తెలిపారు. 'నేను-కీర్తన' చిత్రం ఘన విజయం సాధించాలని దర్శకుడు వీరశంకర్, యాటా సత్యనారాయణ ఆకాంక్షించారు. సంధ్య, జీవా, జబర్దస్త్ అప్పారావు కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: ఎం. ఎల్ రాజా. సినిమాటోగ్రఫీ: కె. రమణ.

యువరాణి పాత్రలో...



'నన్ను దోచుకుందువటే' చిత్రంతో తెలుగులో అడుగుపెట్టి కుర్రకారు మది దోచేశారు నభాన టేశ్. ఆ తర్వాత వరుస ఆఫర్లతో పలు చిత్రాల్లో నటించిన నభా..ఓ ప్రమాదంలో గాయపడి సినిమాలకు రెండేళ్లు విరామమిచ్చారు. ఇటీవలే కోలుకున్న ఆమె తిరిగి నటించడానికి సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఆమె నిఖిల్ సిద్ధార్థ్ పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు'లో సెకండ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులో నభా ఓ పవర్‌ఫుల్ రోల్‌ను పోషిస్తున్నారు. చిత్ర బృందం గురువారం ఆమె పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌ను చూస్తుంటే ఆమె యువరాణి పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. భరత్‌కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. ఇందులో నిఖిల్ పోరాట యోధుడి పాత్రను పోషిస్తున్నారు. ఈ పాత్ర కోసం ఆయన గుర్రపుస్వారీ, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకోవడం విశేషం.

నేను బతికుండగా అంగీకరించను

అతిలోక సుందరి శ్రీదేవిని ప్రేమించి పెళ్లాడారు బోనీకపూర్. దురదృష్టవశాత్తు శ్రీదేవి 2018లో మరణించారు. పలు సందర్భాల్లో ఆమె జ్ఞాపకాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి లోనవుతుంటారు బోనీకపూర్.



ప్రస్తుతం 'మైదాన్' చిత్రం ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న ఆయనను ఓ ఆంగ్ల మీడియా ప్రతినిధి శ్రీదేవి బయోపిక్ ఉంటుందా అని అడగగా, బోనీకపూర్ సమాధానమిచ్చారు. "శ్రీదేవి వ్యక్తిగత స్వేచ్ఛను కోరుకునే వ్యక్తి. బతికున్నంత కాలం ఆమె తన వ్యక్తిగత జీవితంలో జరిగే విషయాలలో ఎంతో గోప్యతను పాటించింది. భర్తగా నేను ఆమె ఆలోచనల్ని గౌరవించాలి. నేను బతికున్నంత వరకూ ఆమె బయోపిక్‌కు అంగీకరించను" అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/1RqKdIQ లో చదవండి.



చిలువూరులో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ప్రచారంలో పాల్గొన్న కూటమి నేతలు

అధికారంలోకి రాగానే యువతకు ఉద్యోగాలు

● గుంటూరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని

దుగ్గిరాల, ఏప్రిల్ 4: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాగానే లక్షలాదిమంది యువతకు ఉద్యోగాల కల్పనపై దృష్టి సారిస్తామని గుంటూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. మండల గ్రామాలు రేవేంద్రపాడు, శృంగారపురంలో గురువారం ఆయనపర్యటించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. మండల టీడీపీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, తాళ్ల అశోక్, గూడూరు వెంకట్రావు, పుతుంబాక సాయికృష్ణ, కొప్పుల మధుబాబు, సర్పంచ్‌లు పాటిబండ్ల కృష్ణప్రసాద్, వాసిరెడ్డి ప్రదీప్, మాజీసర్పంచ్‌లు వాసిరెడ్డి శ్రీనివాసరావు, మొవ్వా చంద్రశేఖరరావు, ఇంటూరి శ్రీను, యలవర్తి అంకమరావు, మాజీఎంపీటీసీ పెందుర్తి మాధురి, రవికాంత్, మేకా కోటయ్య, జూపల్లి వెంకటేశ్వరరావు, కేసంనేని వాసు, పెమ్మసాని రామకృష్ణ, ఇజ్జగాని శంకర్, వీరశంకర్, రెడ్డి వెంకట్రావు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలంలోని చిలువూరు, తుమ్మపూడి గ్రామాల్లో గురువారం పెమ్మసాని ప్రచారం కొనసాగింది. గ్రామాల్లోని ముస్లింలు, ఎస్సీలు పెమ్మసానికి ఎదురేగి, విజయం మనదే అంటూ ఘనస్వాగతం పలుకుతూ, తమవీధులకు తీసుకెళ్లి కుటుంబసభ్యులకు పరిచయం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో తోటకూర సీతారామయ్య, నర్రా శ్రీనివాసరావు, ఎంపీటీసీలు వాసిరెడ్డి లక్ష్మి, జబీన్, చిలువూరు రోజమరి యమ్మ, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మిలతో పాటు నిజాముద్దీన్, జలాలు ద్దీన్, వహిదుల్లా, పినపాటి కరుణాకర్, జీవన్, గార్దైన్ వెంకటేశ్వరరావు, మండల బీజేపీ అధ్యక్షుడు పసుపులేటి గణేష్, పలువురు బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లింలు పాల్గొన్నారు.

గుంటూరు మీదగా రెండు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా రెండు ప్రత్యేక రైళ్లను నడిపేందుకు రైల్వే శాఖ నిర్ణయించింది. నెంబరు 02863 హౌరా - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు నేడు(శుక్రవారం), ఈ నెల 12వ తేదీన ఉదయం 8.20కి గుంటూరుకు వచ్చి 8.25కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 12.15కి యశ్వంత్‌పూర్ జంక్షన్‌కు చేరుకొంటుంది. ఈ రైలు హౌరా నుంచి గురువారం బయలుదేరుతుంది. నెంబరు. 02864 యశ్వంత్ పూర్-హౌరా ప్రత్యేక రైలు ఈనెల 6,13 తేదీల్లో ఉదయం 5గంటలకు బయలుదేరి గుంటూరుకు సాయంత్రం 5.25కి వచ్చి 5.30కి బయలుదేరు తుంది. హౌరాకు మరుసటి రోజు మధ్యాహ్నం 1.25కి చేరుతుంది. ఈ రైళ్ల సేవలను వినియోగించుకోవాలని ప్రయాణీకులకు డీఆర్ఎం రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

ఆలపాటి.. జిల్లాకు ఘనాపాటి



ఆలపాటిని దుశ్శాలువాతో సన్మానిస్తున్న గల్లా మాధవి

● మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు కితాబు
● ఘనంగా మాజీ మంత్రి 'ఆలపాటి రాజా' జన్మదిన వేడుకలు
● వేడుకల్లో పాల్గొన్న ఆనందబాబు, పెమ్మసాని, గల్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆలపాటి ఈ జిల్లాకు ఘనాపాటి అని టీడీపీ నేతలు కొనియాడారు. మాజీమంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ జన్మదిన వేడుకలు గురువారం గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్డులోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఆలపాటి పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో మాజీమంత్రి నక్కా ఆనందబాబు, గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవి పాల్గొన్నారు. ఆలపాటికి కేక్, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పార్టీకి ఆయన చేసిన సేవలు, ప్రజా ప్రతినిధిగా, మంత్రిగా ప్రజలకు అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆలపాటి రాజా ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ఉన్నత పదవులు అలంకరించి జిల్లా ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఆలపాటి అభిమానులు, పార్టీ శ్రేణులు పుష్పగుచ్ఛాలు బహూకరించి, దుశ్శాలువాలతో సత్కరించి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెనాలి నుంచి అనుచరులు, పార్టీ కార్యకర్తలు ఆలపాటి ఇంటికివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు చిట్టాబత్తిన చిట్టిబాబు, మద్దిరాల మ్యాని, రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, చుక్కపల్లి రమేశ్, యాగంటి దుర్గారావు, వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్, నూకవరపు బాలాజి, ఎన్‌వీవీఎస్ వరప్రసాద్ (పెద కూరపాడు బుజ్జి), పిడికిటి తిలక్‌బాబు, కుర్రా అప్పారావు, వెన్నా సాంబశివారెడ్డి, శాకమూరి నారాయణ ప్రసాద్, పంచుమర్తి భూపతిరావు, కార్పొరేటర్లు పోతురాజు సమత, కొమ్మినేని కోటేశ్వరరావు, మానం పద్మశ్రీ తదితరులు ఆలపాటికి శుభాకాంక్షలు తెలిపారు.



ఆలపాటికి మిఠాయి తినిపిస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

జిల్లా జడ్జిల బదిలీలు

గుంటూరు(లీగల్), ఏప్రిల్ 4: రాష్ట్రవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో పనిచేస్తున్న 30 మంది జిల్లా జడ్జిలను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరుజిల్లా, గుంటూరులో మూడో అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న జి.అర్చనను తిరుపతిలోని నాలుగో అదనపు జిల్లాకోర్టు (ఎస్సీ ఎస్టీ కోర్టు)కు బదిలీ చేశారు. గుంటూరులో ఫ్యామిలీ కోర్టు (12వ అదనపు జిల్లా కోర్టు)లో అదనపు జిల్లాజడ్జిగా పనిచేస్తున్న వీవీఎస్ సూర్యనారాయణమూర్తిని రాజమండ్రిలోని ఏసీబీ కోర్టుకు స్పెషల్ జడ్జిగా బదిలీచేశారు. ఆయన స్థానంలో ప్రస్తుతం రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ, మంగళగిరిలో అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న జి.చక్రపాణి ని నియమించారు. గురజాలలో అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న జి. వెంకటేశ్వర్లు మచిలీపట్నంలోని పోక్సో కోర్టుకు స్పెషల్ జడ్జిగా బదిలీ చేశారు. గతంలో నెల్లూరులో ఆరవ అదనపు జిల్లాజడ్జిగా పనిచేసిన ఎస్.సత్యశ్రీని తిరిగి విధుల్లోకి తీసుకొని నరసరావు పేటలో ఖాళీగా ఉన్న 13వ అదనపు జిల్లా కోర్టుకు బదిలీ చేశారు. అనంత పురం ఎస్సీ ఎస్టీ కోర్టులో స్పెషల్ జడ్జిగా పనిచేసిన డి.శ్రీనివాసులును తిరిగి విధు ల్లోకి తీసుకొని తెనాలిలో ఖాళీగావున్న 11వ జిల్లా కోర్టుకు బదిలీ చేశారు. బదిలీ అయిన జడ్జిలు ఈనెల 24 లోగా వారి కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు.

ద్విచకవాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

తాడికొండ, ఏప్రిల్ 4: రేషన్ బియ్యం కోసం వెళ్లిన ఆ వృద్ధురాలిని ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు తాడికొండ మండలం మోతడక గ్రామానికి చెందిన పెనుమచ్చు అంజమ్మ(80) రేషన్ బియ్యం తెచ్చుకోవటానికి ఎండీయూ వాహనం వద్దకు వెళ్లింది. బియ్యం తీసుకోని ఇంటికివస్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా అమరావతి నుంచి గుంటూరు వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధురాలి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ద్విచక్రవాహన దారుడికి గాయాల వ్వటంతో ఆస్పత్రికి వెళ్లాడు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.



కుమారుడు మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లిదండ్రులు

మెడకు చీర బిగించుకొని బాలుడి మృతి

గురజాలటౌన్, ఏప్రిల్ 4: ఇంటి ముందు వేపచెట్టు కింద ఆటాడు కుంటూ ప్రమాదవశాత్తూ చీర మెడకు బిగుసుకోవడంతో బాలుడు మృతిచెందిన సంఘటన మండలంలోని దైదలో జరిగింది. గ్రామానికి చెందిన కొలిపాకుల శ్రీను, శివలక్ష్మి దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం కూడా వ్యవసాయ పనులు నిమిత్తం వారు పొలానికి వెళ్లగా వారి కుమారుడు నారాయణ (13) ఇంటి ముందు ఉన్న వేపచెట్టుకు చీరతో ఉయ్యాల కట్టుకొని ఆడుకుంటున్నాడు. ప్రమాదవశాత్తూ చీర గొంతుకు బిగిసుకోవడంతో ఊపిరాడక మృతిచెందారు. కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగారు.

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 4: ప్రమాదవశాత్తూ నీటి తొట్టెలో పడి మూడేళ్ళ చిన్నారి మృతి చెందిన విషాద ఘటన పట్టణంలోని జరిగింది. స్థానికల వివరాల ప్రకారం.. పట్టణంలోని యడ్ల లింగయ్య కాలనీ శివారు పొలాల వద్ద బుధవారం రాత్రి ఓ కుటుంబానికి చెందిన చిన్నారి ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ నీటి తొట్టెలో పడింది. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురాగా అప్పటికే చిన్నారి మృతి వైద్యులు చెప్పినట్లు సమాచారం. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులను వివరణ కోరగా చిన్నారి మృతిపై తమకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.

పాత కక్షల నేపథ్యంలో గొడ్డలితో దాడి



ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న పెద్దిరాజు

వెల్దుర్తి, ఏప్రిల్ 4: పొలం పనులు ముగించుకొని బైకుపై ఇంటికి వస్తున్న ఓ వ్యక్తిపై ప్రత్యర్థులు దాడి చేసిన ఘటన మండలంలోని కండ్లకుంటలో గురువారం జరిగింది. మండలంలోని కొత్తపుల్లారెడ్డిగూడెంకు చెందిన గన్నెబోయిన గంగిరాజు 2020 సంవత్సరంలో ప్రత్యర్థుల చేతిలో హత్యకు గురయ్యారు. రెండేళ్ల తరువాత ఆ ప్రత్యర్థులు తిరిగి తమ స్వగ్రామమైన కొత్త పుల్లారెడ్డిగూడెంకు చేరారు. గంగిరాజు సోదరులైన లక్ష్మయ్య, శ్రీరాములు, పెద్దిరాజు, శివయ్య, శ్రీనులు కండ్లకుంటలో జీవిస్తున్నారు. కండ్లకుంటలోనే పొలాన్ని కౌలుకు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం పెద్దిరాజు పొలం పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా మార్గ మధ్యంలోని గ్రామ శివారులో గల శ్మశాన వాటిక వద్ద ప్రత్యర్థులు కాపుకాచి దాడికి తెగబడ్డారు. గొడ్డళ్లతో తల, చేతులపై నరికారు. పెద్దిరాజు గట్టిగా కేకలు వేయడంతో గ్రామస్తులు అక్కడకు చేరుకుంటుండడాన్ని గమనించి దాడికి పాల్పడిన వారంతా అక్కడి నుంచి పారిపోయారు. గాయపడిన పెద్దిరాజును మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తనపై తన సోదరుడు గంగిరాజు హత్యకేసులో నిందితుడైన కొమ్ము నానితోపాటు శ్రీను, వేమరాజుతోపాటు మరికొందరు దాడిచేశారని పెద్దిరాజు తెలిపారు.

టీడీపీ నేతపై వైసీపీ కార్యకర్తల దాడి

సత్తెనపల్లి, ఏప్రిల్ 4: మండలంలోని ధూళ్ళిపాళ్ళ గ్రామంలో టీడీపీ నాయకుడు బండారుపల్లి నాగేశ్వరరావుపై బుధవారం రాత్రి వైసీపీ కార్యకర్తలు దాడిచేశారు. నాగేశ్వరరావు వైసీపీ నుంచి ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరారు. రాత్రి నాగేశ్వరరావు తన వాహనంపై ఇంటికి వెళ్తుండగా నాగేశ్వరరావు వాహనాన్ని వైసీపీ కార్యకర్తలు అడ్డుకొని టీడీపీ అభ్యర్థి కన్నాను గ్రామంలోకి ఆహ్వానిస్తారా? అని దుర్భాషలాడుతూ దాడిచేశారు. సమాచారం అందుకున్న నాగేశ్వరరావు వర్గీయులు అక్కడకు చేరుకోవటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు గ్రామానికి వెళ్ళి ఇరువర్గాలను చెదరగొట్టారు. ముందు జాగ్రత్తగా గ్రామంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

వడదెబ్బకు వృద్ధురాలి మృతి

పొన్నూరుటౌన్, ఏప్రిల్4: వేసవి ఎండల తీవ్రత పెరగటంతో వడదెబ్బకు గురై వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని కసుక్రు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కసుక్రు గ్రామానికి చెందిన నాగిశెట్టి మస్తానమ్మ(85) మస్తానమ్మ ఈ నెల 2న వడదెబ్బతో తీవ్ర అస్వస్థకు గురై గుంటూరు జీజీహెచ్‌లో చేరగా, చికిత్స పొందుతూ మృతి చెందిన్నట్లు బంధువులు వెల్లడించారు.

వైసీపీకి మాజీ కౌన్సిలర్ రాజీనామా

సత్తెనపల్లి, ఏప్రిల్ 4: పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ వైసీపీ నేత బచ్చు మనోహర్ వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు గురువారం తెలిపారు. ఆయన భార్య వరలక్ష్మి మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆమె కూడా డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తూ యార్డు కార్యదర్శి ఇస్మాయిల్‌కు రాజీనామా పత్రాన్ని అందించారు. సీనియర్ కౌన్సిలర్ అయిన మనోహర్ టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరేందుకే వైసీపీకి రాజీనామా చేసినట్టు తెలుస్తుంది. ఇప్పటికే మనోహర్ కన్నాను కలసి టీడీపీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

బస్సు ఢీకొని చిరు వ్యాపారి మృతి

నాదెండ్ల, ఏప్రిల్ 4: మండలంలోని సాతులూరు గ్రామ పరిధిలో గల గుంటూరు-కర్నూలు రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫిరంగిపురం గ్రామానికి చెందిన వడిసె బాల చిన్నారావు(58) అనే చిరు వ్యాపారి మృతి చెందాడు. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం బాలచిన్నారావు ఇంటిలో కొవ్వొత్తులు తయారు చేసిషాపుల్లో అమ్ముకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాల చిన్నారావు నరసరావుపేటలో షాపులకు కొవ్వొత్తులను అమ్మేందుకు స్కూటీపై బయలు దేరాడు. సాతులూరు గ్రామ పరిధిలోని బయ్యన రైస్ మిల్లు సమీపంలోకి వచ్చేటప్పటికీ నరసరావుపేట నుంచి గుంటూరు వెళ్ళే ఆర్టీసీ బస్సు స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలచిన్నారావు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ బలరామి రెడ్డి సందర్శించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్రైస్తవులపై కృతజ్ఞత లేని జగన్‌రెడ్డి

● జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ జోసఫ్ మోసిగంటి



పొన్నూరుటౌన్, ఏప్రిల్ 2: ఓట్లేసి గెలిపించిన క్రైస్తవులపై జగన్‌రెడ్డికి కృతజ్ఞత లేదని క్రైస్తవులను మైనార్టీలుగా గుర్తించకపోవటమే ఇందుకు నిదర్శనమని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్, సెయింట్ మేరీస్ కళాశాల మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాజ్యాంగం క్రైస్తవులను మైనార్టీలుగా గుర్తిస్తే జగన్‌రెడ్డి మాత్రం రాష్ట్రంలో మైనార్టీలుగా గుర్తించలేదని ఆరోపించారు. షెడ్యూలు కులాల వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చి క్రైస్తవ మైనార్టీలకు ఇచ్చారని చెబుతున్నారని విమర్శించారు. 18 ఎమ్మెల్సీల అభ్యర్థులను నియమిస్తూ నా ఎస్సీ, నాబీసీలు, నా మైనార్టీలకు సమన్యాయం చేస్తానని జగన్‌రెడ్డి మాట్లాడారన్నారు. ఆ పదవులో ముస్లింలు లేరన్నారు. క్రైస్తవ పేర్లు ఉన్నవారు ఉన్నారు కానీ వారు క్రైస్తవులుగా డిక్లేర్ చేసుకోలేదని వాపోయారు. 48 ఎమ్మెల్సీల్లో నాలుగు ముస్లింలకు ఇచ్చారన్నారు. 11 రాజ్యసభ స్థానాల్లో 5 స్థానాలు రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చి ఒక స్థానం కూడా క్రైస్తవులకు ఇవ్వలేదని ఆరోపించారు. జగన్ పార్టీకి 98 శాతం ఓట్లేసిన క్రైస్తవులను మోసం చేసారని ఆరోపించారు. వీటిని క్రైస్తవ సమాజం గుర్తించి ఎవ్వరికి ఓటు వేయాలో నిర్ణయం తీసుకోవాలని డాక్టర్ జోసఫ్ మోసిగంటి విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రుల ఆత్మ గౌరవం అమరావతి

● రాజధాని ప్రాంత రైతులు, మహిళలు
● 1570వ రోజుకు చేరుకున్న దీక్షలు, ఆందోళనలు

తుళ్ళూరు ఏప్రిల్ 4: రాష్ట్ర రాజధాని అమరావతిని విస్మరించిన వైసీపీని ఎన్నికల్లో తిరస్కరించాలని 33వేల ఎకరాల భూమిని త్యాగం చేసిన రైతులు అన్నారు. అమరావతి, జై ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1570వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ధర్నా శిబిరాలు ఇళ్ల వద్ద దీక్షలు చేస్తున్న పలువురు రైతులు, మహిళలు మాట్లాడారు. మూడు రాజధానులు కావాలని ఎవరూ అడగలేదన్నారు. అమరావతిని చంపేయాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కలాటకు తీశారన్నారు. ఇపటికైనా మించిపోయింది లేదు.. అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధానిగా జగన్‌రెడ్డి ప్రకటించి చిత్తశుద్ధిని చాటుకోవాలని హితవు పలికారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా రాజధాని ప్రాంత 29 గ్రామాలలో రైతుల, మహిళల నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి.



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న బాష్యం ప్రవీణ్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు

6న క్రోసూరులో చంద్రబాబు 'ప్రజాగళం'

● వేలాదిగా తరలి రావాలని భాష్యం ప్రవీణ్ పిలుపు

క్రోసూరు, ఏప్రిల్ 4: క్రోసూరులో ఈ నెల6వ తేదీని ప్రజాగళంలో భాగంగా చంద్రబాబు పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం హెలిప్యాడ్ స్థలాన్ని, బహిరంగ సభా స్థలాన్ని టీడీపీ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు గురువారం పరిశీలించారు. క్రోసూరులోని పశువుల ఆస్పత్రి వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని హెలిప్యాడ్ ఏర్పాటు కోసం నిర్ణయించారు. బహిరంగ సభ వేదిక స్థలాన్ని అందుకూరు సెంటర్‌లో నిర్వహించే విధంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సభకు ప్రజలు వేలాదిగా తరలి రావాలని బాష్యం ప్రవీణ్ పిలుపునిచ్చారు. వారివెంట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రుకాశయ్య, టీడీపీ నేతలు అనుముల కోటిరెడ్డి, రాయపాటి అమృతరావు, వాసిరెడ్డి అనీల్, నలజాల కోటేశ్వరరావు, దుద్దుల యోహోన్, తోకా వెంకటరావు, పలువురు నాయకులు ఉన్నారు.



బండారుపల్లి చెరువులో మట్టిని తవ్వుతున్న జేసీబీ

తాగునీటి చెరువులో మట్టి తవ్వకాలు

● రెండేళ్ల క్రితం తీసుకున్న అనుమతులతో అక్రమంగా తవ్వకాలు
● రెండు చెరువుల్లో నీళ్ల లేకపోవటంతో యథేచ్ఛగా మట్టి స్వాహా
● అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న గ్రామ వీఆర్‌వో

తాడికొండ, ఏప్రిల్ 4: గ్రామస్తుల నీటి సమస్యను పట్టించుకోకుండా...తన అక్రమార్జనే ధ్యేయంగా మంచినీటి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలకు తెరతీసారు ఓ వైసీపీ నాయకుడు. రెండు సంవత్సరాల క్రితం తీసుకున్న పర్మిషన్లను చూపించి గత పది రోజులుగా అక్రమ మట్టి తవ్వకాలు చేస్తున్నారు. గ్రామంలోని రెండు చెరువులను ఎండబెట్టి మరి మట్టి తవ్వకాలు చేస్తునే ఉన్నారు. రెండు చెరువులు ఎండిపోవటంతో నీళ్ల కోసం గ్రామస్తులు, పశువులు దాహం కేకలు వేస్తున్నారు. అక్రమంగా తవ్వకాలు చేసిన మట్టిని బండారుపల్లి-మండపాడు గ్రామాల మధ్య వేస్తున్న రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌కు విక్రయించి జేబులు నింపుకున్నారు. గ్రామ అవసరాల నేపంతో ట్రక్కు మట్టిని రూ. 1000లకు, పెద్ద టిప్పర్ రూ. 4 వేల నుంచి రూ. 5 వేల వరకు విక్రయించారు. అంతటితో ఆగకుండా చెరువులకు త్వరలో నీళ్ల వస్తాయని గ్రామస్తులకు చెప్పి మట్టిని పక్కనే ఉన్న పొలంలో డంప్ చేస్తున్నారు. రాబోయే రోజుల్లో మట్టి అవసరం ఉంటే డంప్ చేసిన దగ్గర నుంచి తీసుకువెళ్తారు. రెండు లారీలను పెట్టి మట్టిని పొలంలోకి డంపు చేస్తున్నారు. గడిచిన ఈ 20 సంవత్సరాల్లో తాగునీటి సమస్య లేని గ్రామంగాలో ఇప్పుడు చెరువుల్లో నీళ్ల లేకపోవటంతో బోరు కూడా ఎండిపోయి తాగునీటి సమస్య తీవ్రతరం అయింది. అయితే తన కళ్ల ముందే చెరువుల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్న గ్రామ వీఆర్‌వో, పంచాయతీ కార్యదర్శులు తవ్వకాలకు కొమ్ముకాస్తున్నారు. మట్టి తవ్వకాలకు పర్మిషన్లు ఉన్నాయని స్థానిక వీఆర్‌వోను వివరణ అడుగగా పొంతనలేని సమాధానాలు చెప్పి అక్రమ మట్టి తవ్వకాలకు మద్దతు ఇస్తున్నారు.



తవ్వకాలు జరిపిన మట్టిని పొలంలో డంపు చేసిన దృశ్యం

జిల్లాలో మైనింగ్, మట్టి, ఇసుక తవ్వకాలకు పక్కా పర్మిషన్లు ఉన్న వారికి ఏఎంఆర్ ప్రైవేటు కంపెనీ బిల్లులు మంజూరు చేస్తుంది. సదరు బిల్లులు లారీ, ట్రాక్టర్ ట్రాన్స్‌పోర్టుకు మాత్రమే బిల్లులు వర్తిస్తాయి. కాని ఇక్కడ ఆ బిల్లులను చూపించి పర్మిషన్లు ఉన్నాయని అందరిని నమ్మిస్తున్నారు. గ్రామ వీఆర్‌వో కూడా ట్రాన్స్‌పోర్టు బిల్లులను ఉన్నాయని ఆవే పర్మిషన్లు అని చెప్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాలపై డిప్యూటి తహసీల్దార్ కాకుమాను ప్రసాద్‌ను వివరణ అడుగగా మట్టి తవ్వకాలకు ఎలాంటి పర్మిషన్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. అక్రమ మట్టి తవ్వకాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కారంపూడి పట్టణానికి చెందిన 50 మంది వలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం రాజీనామా పత్రాలను ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికి అందించారు. - కారంపూడి

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.03 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142, 151,162
చికెన్ విత్ స్కిన్	274.00
చికెన్ స్కిన్ లెస్	284.00

1,15,532 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,10,019 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,15,532 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 80,090 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	19000
నెంబరు. 5	9000	16000
273	8000	16000
341	9000	16500
4884	10500	16000
సూపర్ 10	9000	12800
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	9000	15000
దేవనూరు డీలక్స్	8000	16500
తెల్లకాయలు	5000	11000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్, చిత్రంలో ఆనందబాబు తదితరులు

లక్ష్య సాధకుడు చంద్రబాబును గెలిపించుకుందాం

● పరిచయ సమావేశంలో బాపట్ల లోక్‌సభ అభ్యర్థి కృష్ణప్రసాద్

వేమూరు, ఏప్రిల్ 4 : లక్ష్యసాధకుడైన చంద్రబాబును గెలిపించుకుందాం, రౌడీ పాలన తరిమికొడదాం అని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి లోక్‌సభ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం వేమూరులో నియోజకవర్గ స్థాయిలో విస్తృత స్థాయి సమావేశంతోపాటు, బాపట్ల పార్లమెంట్ స్థాయి ఉమ్మడి అభ్యర్థి కృష్ణప్రసాద్ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి వేమూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా ఆనందబాబు ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను పార్టీ శ్రేణులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ లక్ష సాధకుడైన చంద్రబాబు ఆలోచనలతో ఒకేసారి 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించి దాదాపు 30లక్షల మందికి వృత్తిపరమైన ఉపాధి కల్పించారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని అప్పుడు బాపట్ల సమీపంలోని నిజాంపట్నం పోర్టును విశాఖ తరహాలో అభివృద్ధి చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గపు పాలనవల్ల ప్రజలు, రాష్ట్రం కునారిల్లాయని ఆవేదన వ్యక్త పరిచారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ పించన్ల పంపిణీపై నాటకా లు ఆడుతూ టీడీపీపై బురద చల్లుతున్నారని విమర్శించారు. వలంటీర్లకు చంద్రబాబు వ్యతిరేకం కాదని, వారిని అప్రజాస్వామ్యంగా వాడుకుంటున్నారన్న విషయాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా ఉండి ఏ మాత్రం అభివృద్ధి చేయకుండా తాను ఓడిపోతానన్న భయంతో మేరుగ నాగార్జున ఆరు నెలల ముందే ఇక్కడ నుంచి పారిపోయారని విమర్శించారు. సమావేశంలో టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్, జిల్లా కార్యదర్శి అనూరాధ, పార్టీ నాయ కులు టి.సాయిబాబా, ఘైనేని మురళీకృష్ణ, డాక్టర్ కనగాల మధుసూదనప్రసా ద్, యలవర్తి బ్రహ్మానందం, మహిళా విభాగం అధ్యక్షురాలు ఘంటా స్వాతి, దండే వెంకటసుబ్బారావు, తమ్మాశివారెడ్డి, వేమూరి మురళీకృష్ణ, తాడికొండ దయాబాబు, అమ్మిశెట్టి కిషోర్‌బాబు, వాకా శేషుబాబు, వివిధ పార్టీ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకుడు

మండలంలోని కుచ్చెళ్ళపాడు గ్రామ పాలకేంద్రం మాజీ అధ్యక్షుడు వైసీపీ నాయకులు తాడికొండ చిన్న కోటేశ్వరరావు గురువారం టీడీపీలో చేరారు. వేమూరులో ఆనందబాబు ఆయనకు కండువా కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ చిన్న కోటేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో తాడికొండ సుధీర్‌బాబు, తులం రమేష్‌బాబు, గాజుల వెంకటసుబ్బయ్య, విష్ణుమెలకల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు...



రమేష్‌బాబును టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఆనందబాబు

చుండూరు, ఏప్రిల్ 4 : మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిరాల రమేష్‌బాబు తెలుగుదేశం పార్టీలో గురువారం చేరారు. అమృతలూరులోని పార్టీ కార్యాలయంలో రమేష్‌బాబును పార్టీలోకి తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సాదరంగా ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆయన వెంట మద్దిరాల మ్యానీ, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

పార్టీ విజయంపై దిశా నిర్దేశం చేసిన ఆనందబాబు

అమృతలూరు, ఏప్రిల్ 4 : రానున్న ఎన్నికల్లో పార్టీ విజయంపై నాయకులు, కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి నక్కా ఆనందాబు దిశా నిర్దేశం చేశారు. గురువారం అమృతలూరులోని పార్టీ కార్యాలయంలో అమృతలూరు, మూల్పూరు, పెదపూడి, కూచిపూడి, యడవూరు గ్రామాల క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో ఎలా ముందుకు సాగాలో వివరించారు. మండల స్థాయి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు లంక గ్రామాల్లో ఆనందబాబు ప్రచారం

భట్టిప్రోలు, ఏప్రిల్ 4: ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవా రం సాయంత్రం మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లం క గ్రామాల్లో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. కూటమి బలపరచిన టీడీపీ అభ్యర్థి నక్కా ఆనందబాబు లంక గ్రామాల్లో పర్యటించి గడపగడపకు తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించనున్న ట్లు నాయకులు తెలియజేశారు. కావున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

కౌంటింగ్ ముగిసేవరకు స్ట్రాంగ్‌రూమ్ మీద నిరంతర నిఘా

● అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్



స్ట్రాంగ్‌రూమ్‌లపై సిబ్బందికి సూచనలు చేస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్, ఆర్డీవో రవీందర్

బాపట్ల, ఏప్రిల్ 4 : కౌంటింగ్ ముగిసే వరకు స్ట్రాంగ్ రూమ్‌ల మీద నిరంతరం నిఘా కొనసాగుతుందని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌ల చుట్టుపక్కల ప్రాంతాలను, ప్రధాన మార్గాలను ఆర్డీవో గంధం రవీందర్‌తో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్ రక్షణ చర్యలు గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ విషయమై సమావేశం నిర్వహించి అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని ఇప్పటికే బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లు కొరకు అధికారులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి పరిశీలించామని రాకపోకలకు అవసరమయ్యే మార్గాలను పరిశీలించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల, రేపల్లె, బాపట్ల ఆర్డీవోలు, డీఎస్పీలు, ఆర్వోలు, సర్వేయర్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

పెన్షన్‌లు ఇంటి వద్దనే ఇవ్వాలి : రోజన్‌బాబు

బాపట్ల, ఏప్రిల్ 4 : వృద్ధులు, దివ్యాంగులకు పెన్షన్‌లు ఇళ్ళ వద్దకే తీసుకొచ్చి ఇవ్వాలని మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్‌బాబు డిమాండ్ చేశారు. ఈవిషయమై గురువారం జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. అనారోగ్యంతో లేవలేని వృద్ధులు, దివ్యాంగులకు పెన్షన్‌లిచ్చే విషయంలో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో తెలుగుదేశంపై విమర్శలు చేయటం సరికాదన్నారు. దీనికి కారకులైన వైసీపీ నాయకులు ఎన్నికల ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీలపై బురదజల్లే ప్రయత్నం చేయటాన్ని మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల ఆనంద్, గోళ్ళ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గుండ్రెడ్డిశివ టౌన్‌షిప్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జీఎస్సార్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుండ్రెడ్డి శివ

బాపట్ల, ఏప్రిల్ 4 : జీఎస్సార్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుండ్రెడ్డి శివ ఆధ్వర్యంలో సూర్యలంక రోడ్డులో ఏర్పాటు చేసిన గుండ్రెడ్డిశివ టౌన్‌షిప్ బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. జబర్దస్త్ టీమ్, బిల్డర్స్, పలువురు ప్రముఖులతో కలిసి 31వ వెంచర్‌గా ఏర్పాటు చేసిన దీనికి సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య పాల్గొన్నారు.

బాపట్ల ప్రగతికి పాటుపడతా.. అవినీతి లేని పాలనందిస్తా

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన



ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహిస్తున్న వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఏప్రిల్ 4 : బాపట్ల ప్రగతికి పాటుపడుతానని, అవినీతి లేని పాలన అందిస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచార ప్రారంభ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి దేవాలయంలో గురువారం ఆయన పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు అందుకొని ప్రచార రథం ఎక్కి పార్టీ శ్రేణులతో అప్పికట్ల వరకు రోడ్‌షో నిర్వహించారు. అప్పికట్ల గ్రామంలోని శ్రీ గంగా అన్నపూర్ణా విశాలక్ష్మీ సమేత శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భావదేవుని ఆశీస్సులతో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించానన్నారు. రాబోయే ఎన్నికలలో విజయమే లక్ష్యంగా కూటమిశ్రేణులతో కలిసి ముందుకెళుతున్నట్లు తెలిపారు. బాపట్ల కోసం, ప్రగతి కోసం ప్రజల సేవే పరమావధిగా పనిచేస్తానన్నారు. పేద ప్రజల జీవితాలు బాగు చేయాలనే ఉద్దేశ్యంతో తాను చేస్తున్న ప్రయత్నానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, వేగేశన రాకేష్‌వర్మ, పార్టీ పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కావూరి శ్రీనివాసరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్, బీజేపీ నాయకులు సూర్యనారాయణ, రామకృష్ణ, టీడీపీ పట్టణ కార్యదర్శి విన్నకోట వీరయ్యనాయుడు, అల్లం గోపికృష్ణ, జిట్టా శ్రీనివాసరావు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, మాజీ ఎంపీపీ మానం విజేత, మహిళా నాయకులు చెన్నుపాటి హైమావతి, దగ్గుమల్లి రాణి, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్ నజ్మా, సుజాత, గ్లోరియానేట్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

బాపట్ల టౌన్, ఏప్రిల్ 4 : గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో బాపట్ల నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఎన్నికల ప్రచార ప్రారంభం సందర్భంగా అప్పికట్ల గ్రామంలో గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎటువంటి అవినీతి లేకుండా పాలన అందిస్తామని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రంలోనే అత్యున్నత అభివృద్ధిని బాపట్ల నియోజకవర్గంలో చేసి చూపిస్తానని అన్నారు. వృద్ధులు, వితంతువుల పెన్షన్ పంపిణీలో వైసీపీ దుష్ప్రచారం చేస్తుందన్నారు. రాష్ట్రంలో అరాచకపాలనతో పాటు అవినీతిపాలన ఉందని, వాటిని నిర్మూలించాలంటే కలిసికట్టుగా టీడీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కావూరి శ్రీనివాసరెడ్డి, గొలపల శ్రీను, ఇనగంటి గాంధీ, ఇనగంటి అనురాధ, మానం విజేత, జిట్టా శ్రీనివాసరావు, కళ్ళం హరినాధరెడ్డి, జనసేన నాయకులు నామన వెంకటశివన్నారాయణ. అల్లం గోపికృష్ణ, గుత్తికొండ రాజేష్, గుడిపూడి సర్పంచ్ హనుమాన్‌జి, భర్తిపూడి సర్పంచ్ అచంట అమరేష్ పాల్గొన్నారు.

ధరివాదకొత్తపాలెంలో...

బాపట్లరూరల్, ఏప్రిల్ 4 : టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ గురువారం బాపట్ల పట్టణం 34వవార్డు ధరివాదకొత్తపాలెం గ్రామం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలోని యువత వేగేశన నరేంద్రవర్మ ఎన్నికల ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొని స్వాగతం పలికారు. అదేవిధంగా మహిళలు పెద్దఎత్తున పాల్గొని పూలు చల్లుతో తమ మద్దతు మీకే అంటూ హారతులు పట్టి తిలకం దిద్దారు. వార్డులో ప్రచార రథంపై సాగుతూ రానున్న ఎన్నికలలో తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సూపర్‌సిక్స్ పథకాలతో రాష్ట్ర ప్రజల జీవనవిధానాలలో ఆర్థిక పురోగతి ఉంటుందని, తప్పక చంద్రబాబును గెలిపించుకోవాలని కోరారు.



వేగేశన నరేంద్రవర్మకు హారతులు పడుతున్న ధరివాద కొత్తపాలెం మహిళలు

టీడీపీలో చేరిన వైసీపీ నాయకురాలు

బాపట్ల, ఏప్రిల్ 4 : పట్టణంలోని 34వ వార్డుకు చెందిన వైసీపీ నాయకురాలు వెంకటేశ్వరమ్మ గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ జిట్టా ప్రమీలారాణి, సీనియర్ నాయకులు జిట్టా శ్రీనివాసరావు, అల్లం గోపికృష్ణల సమక్షంలో ఆమెకు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ గురువారం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులకు సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోసం తెలుగుదేశం విజయం సాధించటం అవసరమని అన్నారు.

పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తి

● ఇంటింటికీ వెళ్లి అందించడంలో అమలుకాని మార్గదర్శకాలు

బాపట్ల, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీ జిల్లాలో గురువారం రాత్రికి దాదాపు 90 శాతం పూర్తయింది. దివ్యాంగులకు, అనారోగ్యంతో బెడ్‌మీద ఉన్నవారు, వీల్‌చైర్‌లో ఉన్నవారికి ఇంటికి వెళ్లి పింఛన్ అందించాలన్న ఆదేశాలు గురువారం కూడా పూర్తి స్థాయిలో అమలుకాలేదు. చాలా మంది దివ్యాంగులు సైతం సచివాలయాలకు వచ్చే పింఛన్ తీసుకోవడం గమనార్హం. పింఛన్ల పంపిణీ విషయంలో వైసీపీ పన్నిన కుట్రలు మూలంగానే తమకు ఈ అవస్థలు ఏర్పడ్డాయని పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా పింఛన్ అందని ఆ పది శాతంలో ఎక్కువగా ఉన్నది దివ్యాంగులేనని తెలుస్తోంది.

ఆదేశాలపై నిర్లక్ష్యం...

సచివాలయాలకు వచ్చి పింఛన్లు తీసుకునే విషయంలో కొంతమందికి మినహాయింపు ఇచ్చిన ప్రభుత్వం వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఆ సొమ్మును అందజేయాలని ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. కానీ వైసీపీ నేతల కుట్రల ఫలితంగా ఈ ఆదేశాలు పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం చేసిన పింఛన్ల పంపిణీ అంతా సచివాలయాల వద్దే జరగ్గా, గురువారం కూడా దాదాపు అన్నీ అక్కడే జరిగినట్లు తెలుస్తోంది. గురువారం రాత్రికి 90 శాతం పంపిణీ పూర్తయినట్లు యంత్రాంగం చెబుతోంది. వీటిలో ఇళ్లకు వెళ్లి ఇచ్చిన పెన్షన్లు అన్నీ కలిపి 500 కూడా లేకపోవడం గమనార్హం.

ఉపాధ్యాయులంతా సమయపాలన పాటించాలి : ఆర్జేడీ

బాపట్ల టౌన్, ఏప్రిల్ 4 : పది పబ్లిక్ పరీక్షల మూల్యాంకనంలో ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆర్జేడీ లింగేశ్వరరావు అన్నారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్ పది మూల్యాంకన కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి ఉపాధ్యాయులు చేస్తున్న మూల్యాంకనాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతి చెందారన్నారు. దానిని దృష్టిలో ఉంచుకొని పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా మెడికల్ కిట్‌లు, గాలి, వెలుతురు, తాగునీరు అందుబాటులో ఉంచామన్నారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితులలో అంబులెన్స్ కూడా సిద్ధంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో పేపర్లను మూల్యాంకనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో కె.నారాయణరావు, డిప్యూటీ డీఈవో జి.వెంకటేశ్వర్లు, ఎంఈవో-2 ప్రసాదరావు, ఏఎస్‌వో డి.సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వీప్ బాపట్ల ఫొటోబూత్ ప్రారంభించిన జేసీ

బాపట్ల, ఏప్రిల్ 4 : బాపట్ల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వీప్ బాపట్ల ఫొటోబూత్‌ను జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి.హెచ్.శ్రీధర్ గురువారం ప్రారంభించారు. ఐదు ప్రాంతాలలో ఈ ఫొటోబూత్ ఫ్రేమ్‌లు ఏర్పాటు చేసి ఓటర్లకు అవగాహన పెంచేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఫొటోబూత్ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, కర్లపాలెం, పిట్టలవానిపాలెం తహసీల్దార్‌లు నిర్మలానందబాబా, కె.స్ఫూర్తి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి,హసీనా, సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా విశిష్టమైనది : ఆర్డీవో

బాపట్ల, ఏప్రిల్ 4 : బాపట్ల జిల్లా విశిష్టమైనదని ఆర్డీవో గంధం రవీందర్ తెలిపారు. జిల్లా ద్వితీయ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం ఫోరంఫర్‌బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా ఖ్యాతిని తెలిపే కరపత్రాలను ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు ఆధ్వర్యంలో ఆర్డీవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కెల్లా బాపట్ల జిల్లాలోనే తొలిసారిగా చారిత్రకయుగంలోకి ప్రవేశించిందన్నారు. ఆంధ్రుల చరిత్ర బాపట్ల జిల్లాలోనే ప్రారంభమైందన్నారు. బాపట్ల జిల్లా తెలుగు పద్యానికి పట్టం కట్టిందని, తెలుగు సాహిత్యం ఇక్కడ ఓనమాలు దిద్దుకుందన్నారు. శ్రీనాధుడు, ఎర్రాప్రగడ వంటి ఎందరో మహాకవులు ఇక్కడ నడయాడారని తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి : సీఐ

బాపట్ల, ఏప్రిల్ 4 : రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పట్టణ సీఐ యు.శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని 7వ వార్డు ఉప్పరపాలెం పరిసర ప్రాంతాలలో గురువారం పోలీసుసిబ్బందితో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్ళి ఓటు హక్కును వినియోగించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు : డీఎస్పీ

బాపట్ల, ఏప్రిల్ 4 : సరిహద్దులలో వాహనాల తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ తెలిపారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు కేంద్ర సాయుధ బలగాలను ఉపయోగించి వాహనాల తనిఖీలు, ఫ్లాగ్‌మార్చ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాపట్ల మార్కెట్ యార్డు సమీపంలో బైపాస్‌రోడ్డు దగ్గర గురువారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మద్యం, నగదు, ఇతర వస్తువుల అక్రమ రవాణాను కట్టడి చేయటానికి వాహన తనిఖీలను ముమ్మరం చేస్తున్నామని, దీని కోసం సాయుధ బలగాలను కూడా ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ యు.శ్రీనివాసులు, ఎస్సైలు అబ్దుల్ రజాక్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

● వేమూరు, ఏప్రిల్ 4: డబ్బు, మద్యం అక్రమ సరఫరా జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టారని సీఐ రామకృష్ణ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గురువారం వేమూరు ఎస్ఐ ఆధ్వర్యంలో పలు గ్రా మాల్లో పర్యటించి ముమ్మరంగా వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎవరైనా నగదును తీసుకెళ్లవలసి వస్తే అందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు ఉండాలని లేకపోతే తనిఖీల్లో పట్టుబడినప్పుడు ఆ నగదును ప్రభుత్వానికి అప్పగిస్తామని తెలిపారు.

● కర్లపాలెం, ఏప్రిల్ 4 : బాపట్ల నుంచి కర్లపాలెం రహదారిలో గురువారం సాయంత్రం బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ముమ్మరంగా వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నియమావళి ప్రతిఒక్కరు పాటించి పోలీసు వారికి సహకరించాలని డిఎస్పీ మురళీకృష్ణ అన్నారు. వాహన తనిఖీలలో పట్టణసీఐ శ్రీనివాసులు, ఎస్సైలు రజాక్, సుధాకర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● రేపల్లె, ఏప్రిల్ 4: వాహనాల్లో పరిమితికి మించి నగదును తీసుకుని వెళ్లరాదని పట్టణ సీఐ నజీర్‌బేగ్ అన్నారు. గురువారం పాత పట్నంలోని అంకమ్మచెట్టు వద్ద సార్వత్రిక ఎన్నికల కోడ్ సందర్భంగా వాహనాలను పోలీస్, పారామిటరీ బృందంతో తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున పరిమితికి మించి నగదును తీసుకుని వెళ్లరాదని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఉపేక్షించేది లేదని అన్నారు. రేపల్లె పట్టణంలోని, పెనుమూడి వారధి వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీ నిర్వహిస్తున్నామని అన్నారు.

బాబుజగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

బాపట్ల, ఏప్రిల్ 4 : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్త బాబుజగ్జీవన్‌రామ్ జయంతిని గురువారం డాక్టర్ ఎన్టీఆర్ ఆహారవిజ్ఞాన సాంకేతిక కళాశాలలో నిర్వహించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ ఎల్.ఏడుకొండలు, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రచారం

కర్లపాలెం, ఏప్రిల్ 4 : ప్రజలందరూ రాబోయే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను ఎంపీగా నందిగం సురేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రజలను అభ్యర్థించారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఎం.వి.రాజుపాలెంలో గురువారం ఎమ్మెల్యే కోన రఘుపతి వైసీపీనాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ దొంతిబోయన సీతారామిరెడ్డి, ఆట్ల నాగేశ్వరరెడ్డి, యల్లావుల ఏడుకొండలు, వైసీపీనాయకులు తదితరులు ఉన్నారు.

హిజ్రాపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

కొల్లూరు, ఏప్రిల్ 4 : హిజ్రాపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రారెడ్డి గురువారం తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ రాత్రి కొల్లూరులోని పెద్దబజారులో చెరుకుపల్లి మండలం, గూడవల్లి గ్రామానికి చెందిన జ్యోతుల శ్రీకాంత్ అలియాస్ శ్రీలేఖ అనే హిజ్రాపై కొల్లూరుకు చెందిన గాదె సత్యనారాయణ అనే వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడటంతో పాటు బ్లేడుతో హిజ్రా గొంతుపై గాయపరిచాడు. బుధవారం రాత్రి హిజ్రా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యం

కొల్లూరు, మార్చి 4 : తల్లి ఇద్దరు పిల్లలు అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రారెడ్డి గురువారం తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం... మండల పరిధిలోని చిలుమూరు గ్రామానికి చెందిన బేతాళ రాధ కుమార్తె తుమాటి గిరిజ కొల్లిపర మండలం బొమ్మువానిపాలెంలో నివాసం ఉంటుంది. ఇటీవల తన ఇద్దరు పిల్లలతో పుట్టింటికి వచ్చి తిరిగి ఈ నెల 2వ తేదీన తమ గ్రామం బొమ్మువానిపాలెం వెళ్లేందుకు ఆమె తల్లి బస్సు ఎక్కించింది. కాగా తన కుమార్తె, మనువరాళ్లు అయిన ఐనిక, కృతికలు బొమ్మువానిపాలెం చేరుకోలేదని సమాచారం తెలుసుకున్న గిరిజ తల్లి తమ బంధువులు, స్నేహితులను వాకబు చేయగా వారి వద్దకు కూడా వెళ్లలేదని నిర్ధారణ కావడంతో పోలీసులను ఆశ్రయించింది. కుమార్తె, ఇద్దరు మనుమరాళ్లు కనిపించడం లేదని రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్రారెడ్డి తెలిపారు.

ముస్లింలు టీడీపీకి అండగా నిలవాలి

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



ఇఫ్తార్‌లో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, ఏప్రిల్ 4: కఠోర ఉపవాసంతో నియమ, నిబ ంధనలతో ప్రార్థనలు నిర్వహించే ముస్లింలకు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం రాత్రి నిజాంపట్నం గ్రామంలో ముస్లింలకు ఇఫ్తార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆప్యాయంగా పలకరిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మతపెద్దలు నిర్వహించిన ప్రార్థనలో పాల్గొన్నారు. రంజాన్‌మాసంలో ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలు పాటించి తమకు ఉన్నదానిలో పదిమందికి పెట్టే గుణం, ఆకలి దప్పికల విలువలను తెలియజేప్పేదే రంజాన్ మాసమని అనగాని అన్నారు. గతంలో మాదిరిగానే మీరు నాపై చూపే ప్రేమ అభిమానాలకు ఎప్పటి రుణపడి ఉం టానని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక మైనార్టీ సోదరీ, సోదరీమణులు తమకు అండగా నిలవాలని కోరారు. అనంతరం ఇఫ్తార్‌లో పాల్గొని వివిధ రకాల వంటకాలను వారికి వడ్డించారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు పఠాన్ ఖాదర్‌బాషా, పఠాన్ ఖాదర్‌బాబు, షేక్ జాని, ఇమ్రాన్‌ఖాన్, కొత్వాల్ పార్కు జాని, షేక్ రబ్బాని, జిలాని ఖాన్, షేక్ సుబాని, బుద్ధాం జాని, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, బొమ్మిడి రామకృష్ణ, కేసన రామకృష్ణ, తాతా ఏడుకొండలు, పంతాని మురళీధరరావు, నాయుడు గోపి, ఓగిబోయిన వెంకటయాదవ్, పీతా సాయిబాబు, కన్నా మీరయ్య, లంకే మీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో టీడీపీ అధికార ప్రతినిధి

వేమూరు, ఏప్రిల్ 4 : వేమూరు పంచా యతీ పరిధిలో టీడీ పీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు విజయాన్ని కాంక్షిస్తూ ప్రారంభించిన ఇంటిం టి ఎన్నికల ప్రచారం గురువారం మూడో రోజుకు చేరుకుంది. బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు ధర్మపురం, సత్యనారాయణపురంలో ఇంటింటికి వెళ్లి మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. అసెంబ్లీ అభ్యర్థిగా నక్కా ఆనందబాబును, లోక్ సభ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. వివిధ విభాగాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీ దుష్టపాలనను సాగనంపండి : శివప్రసాద్



ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్న అనగాని శివప్రసాద్, టీడీపీ నాయకులు

రేపల్లె, ఏప్రిల్ 4: రాష్ట్రంలో ఐదేళ్ళ వైసీపీ దుష్టపాలనను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. గురువారం నిజాంపట్నంలో పలు కాలనీల్లో శంఖారావంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఐదేళ్ళ పాలనలో వైసీపీ చేసిన అరాచకాలను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళలో 9 సార్లు కరెంటు చార్జీలు పెంచారని, పేద, మధ్య తరగతి కుటుంబాలపై అధిక భారం మోపే విధంగా పెట్రోల్, డీజిల్ చార్జీలు, పన్నులు విపరీతంగా పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పంతాని మురళీధరరావు, బొమ్మిడిరామకృష్ణ, యేమినేని బుల్లిబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మైలా నరేష్, నాయుడు గోపి, ఎంపీటీసీ మేకా రాజేష్‌కన్నా, మరకా మునలయ్య, నల్లపాటి యల్లయ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి అనగానిని గెలిపించాలి

చెరుకుపల్లి, ఏప్రిల్ 4: గ్రామ సీమలు అభివృద్ధి దిశగా పయనించాలంటే టీడీపీ, జనసేన, బీజేపీలను బలపరిచిన అనగాని సత్యప్రసాద్ ను గెలిపించాలని రేపల్లె నియోజకవర్గ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి అన్నారు. గురువారం ఆరేపల్లి పంచాయతీలోని ఆరేపల్లి, ప్రసాదంవారిపాలెం, వాకావారిపాలెం ఎస్సీకాలనీలో జరిగిన శంఖారావంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా రాంబొట్లవారిపాలెంలో జరుగుతున్న బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ పాల్గొని ప్రజలంతా చంద్రబాబు, పవన్, మోదీలకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు నాగుల నరేంద్ర, అనిల్, టంగు పోలిరెడ్డి, పిట్టు శ్రీనివాస్‌రెడ్డి, పద్యాల వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ,జనసేన మండల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శుల మత్తి భాస్కరరావు, దూళ్ళ సురేష్, మొహమాటం పృథ్వీ, బీజేపీ నాయకులు కందుల చంద్రమౌళి, పూషడపు కృష్ణ ప్రసాద్, టీడీపీ నాయకులు విస్సంశెట్టి శ్రీనివాసరావు, తాతా సీతయ్య, మొగలిపువ్వు శ్రీనివాసరావు, నాగుల పున్నారావు, నిర్మల్‌కుమార్ పాల్గొన్నారు.

దోనేపూడిలో ఆనందబాబు విజయం కోరుతూ ప్రచారం



దోనేపూడిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

కొల్లూరు, ఏప్రిల్ 4: వేమూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు తరపున టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు ప్రచారం నిర్వహించారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని దోనేపూడిలో పార్టీ శ్రేణులు ఇంటింటికి తిరుగుతూ ఉమ్మడి అభ్యర్థి ఆనందబాబుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ, బాబు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ఓటర్లకు పంపిణీ చేస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేయా లని అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమంలో టీడీపీ మండల అధ్య క్షుడు ఘైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, జీఎల్‌జీ భగవాన్, వేనిగళ్ల మహేష్, నిమ్మగడ్డ అనీల్, యలవర్తి కోటేశ్వరరావు, ఎన్నారై మణికంఠ, వేములపల్లి మోహనకృష్ణ, కోగంటి శివవెంకటేశ్వరరావు, దూళిపూడి కృష్ణ, మున్నంగి విజయ్, శిగిలిశెట్టి రాఘవరావు, తోట సాంబయ్య, యడ్ల శ్రీను, తదితర కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన పోలీసు అధికారులను అరెస్టు చేయాలి

భట్టిప్రోలు, ఏప్రిల్ 4: ఏపీలో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన పోలీసు అధికారులను అరెస్టు చేయాలని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ట్యాపింగ్ చేసిన నిందితులపై సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. కొంతమంది అధికారులు సీఎం జగన్‌కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరగాలంటే తక్షణమే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

నగరం, ఏప్రిల్ 4: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకుని మంచి నాయకులను ఎన్నుకోవాలని తహసీల్దార్ శ్రీశిల్పా అన్నారు. గురువారం మండలంలోని చిన్నమట్లపూడి గ్రామం లో ఓటు హక్కు వినియోగంపై గ్రామంలో అవగాహన ర్యాలీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు గ్రా మంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కా ర్యక్రమంలో డీటీ మస్తాన్‌రావు, గ్రామస్థులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

రేపల్లె, ఏప్రిల్ 4: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రేపల్లె అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీ, బాపట్ల జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ అయోధ్య రామిరెడ్డి అన్నారు. గురువారం రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా గాదె మధుసూదన్‌రెడ్డి, అడపా శేషులను నియమించారని ఎంపీ మోపిదేవి సూచనలతో రానున్న ఎన్నికల్లో క్రియాశీలకంగా వ్యవహరించి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీ మోపిదేవి, డాక్టర్ ఈవూరి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరులో వైసీపీకి షాక్

- ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన కాపు నేతలు
- నమ్మకం నిలబెట్టుకుంటా.. అందరికీ అండగా ఉంటా

మార్టూరు, ఏప్రిల్ 4 : మార్టూరులో వైసీపీకి షాక్ తగిలింది. బలపాం కాలనీకి చెందిన కాపు నేతలు, 30 కాపు కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారంతా గురువారం మార్టూరు నుంచి ద్విచక్రవాహనాలపై ర్యాలీగా వెళ్లి మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో తెలుగుదేశం బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికీ ఏలూరి కండువాలు వేసి ఆహ్వానించారు. గతంలో కొంతమంది కాపు నేతలు తెలుగుదేశంలోనే ఉన్నప్పటికీ ప్రస్తుతం చేరిన కాపు నాయకులతో దాదాపుగా 90శాతం కాపు కుటుంబాలు టీడీపీ కూటమిలో చేరినట్లయింది. మార్టూరులో సుమారు 250 కాపు కుటుంబాలు ఉన్నాయి. వారంతా గతంలో 2014, 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతుగానే ఉన్నారు. అయితే ఏడాది క్రితం పర్చూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్తగా చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి రాకతో కాపు నేతలు ఆయన వెంట వెళ్లారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల క్రమంలో ఆమంచి పర్చూరు సమన్వయ కర్తగా వైదొలగి చీరాలకు వెళ్లిపోవడంతో కాపు నాయకులు టీడీపీలోకి వచ్చేందుకు మొగ్గు చూపారు. గురువారం వారంతా భారీగా తరలి వచ్చి ఏలూరి సమక్షంలో సైకి లెక్కారు. పార్టీలో చేరినవారిలో సకల ఆంజనేయులు, పెంట్యాల బుల్లయ్య, పూజల నాగు, పెంట్యాల సుబ్బరామయ్య, ముప్పవరపు హనుమంతరావు, గోపిశెట్టి కోటయ్య, తిరుమల శెట్టి వీరాంజనేయులు, పెంట్యాల భద్ర య్య, కాసా నాగార్జున, పూజల పవన్, ముప్పవరపు నాగేశ్వరరావు, ఓబుల శెట్టి సుబ్బారావు, గజ్జల శివ, గజ్జల సాంబ, కందుకూరి చంద్రశేఖర్, కందుకూరి శివన్నారాయణ, సంజయ్, భార్గవ్, కాకుమాను కిరణ్, గుత్తి నాగరాజు తదితర కుటుంబాలు పార్టీలో చేరారు.


వైసీపీ వార్డు సభ్యుడిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఏలూరి

అండగా ఉంటా : ఎమ్మెల్యే ఏలూరి

రాష్ట్ర అభివృద్ధికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కట్టాయన్నారు. మాపై నమ్మకంతో వచ్చిన మీకు అన్ని వేళలా అండగా ఉంటానని కాపు నాయకులకు ఏలూరి మాటిచ్చారు. అందరం ఒక్కటై జగన్‌రెడ్డిని గద్దె దింపుదామన్నారు. ప్రజల భవిష్యత్ కోసం చంద్రబాబు జనసేన అధినేత పవన్ కల్యాణ్ అరాచక ప్రభుత్వంపై పోరు సాగిస్తున్నారన్నారు. ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకొని కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న జగన్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేయాలన్నారు.

బెదిరించినా ఏలూరితోనే : కాపు నేతలు

బెదిరించినా.. భయపెట్టినా మీతోనే ఉంటామని కాపు నేతలు ఎమ్మెల్యే ఏలూరికి స్పష్టం చేశారు. మీ గెలుపునకు సాయశక్తులా కృషి చేస్తామని నాయకులు ఏలూరికి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా ఏలూరి విజయమే లక్ష్యంగా పనిచేస్తామని ప్రతినబూనారు.

వైసీపీని వీడి టీడీపీలోకి

మార్టూరు మండలం నుంచి వైసీపీ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరుతున్నారు. గురువారం ఉదయం


ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన మార్టూరు కాపు నేతలు

ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ఏలూరి కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మార్టూరు గ్రామ పంచాయతీ 13వ వార్డు మెంబరు వైసీపీ నాయకుడు పెనుబోయిన శ్రీనివాసరావు, బలరాంకాలనీకి చెందిన రామిశెట్టి వెంకటేశ్వర్లు పార్టీలో చేరగా, వారిని ఏలూరిని స్వాగతించారు. అలాగే మండలంలోని కోలలపూడి గ్రామంలో వైసీపీకి చెందిన ఎస్సీలు గాలి ఏసుబాబు, గాలి పేరయ్య, కుంచెపు శ్రీనివాసరావు, తాతా రాం బాబు, గాలం కామయ్య టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కామినేని జనార్దన్, షేక్ రజాక్, తాటి నాగేశ్వరరావు, తాటి నాగార్జున, తొండెపు ఆది నారాయణ, మిన్నెకంటి రవికుమార్, గొట్టిపాటి వెంకట్రావు, రావినేని శ్రీనివాసరావు, కన్నె గంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి గెలుపు కోసం కలిసికట్టుగా

పర్చూరు : రాష్ట్ర భవిష్యత్ కోసం తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం కలసి కట్టుగా ముందుకు సాగుదామని పలువురు నాయకులు పిలుపు నిచ్చారు. గురువారం పర్చూరులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారానిన నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, యువకులు, మహిళలు తరలిరావడంతో శ్రేణుల్లో జోష్ నెలకొంది. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కొల్లా శివరాంప్రసాద్, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, తంగెళ్ల మల్లికార్జునరావు, మామిడిపాక హరిప్రసాద్, గడ్డిపాటి శ్రీనివాసరావు, మల్లాధి సురేష్, కృష్ణంశెట్టి జగదీష్, కొల్లా చౌదరి, తులసి రామాంజనేయులు, ఊటుకూరి నిర్మల, శివాలశెట్టి రమాదేవి, కొల్లా సుబ్బాయమ్మ, జనసేన పార్టీ నాయకులు కారంపూడి సందీప్ తేజ, రంగిశెట్టి ఆంజనేయులు, మారుతి, వీరాంజనేయులు, తోట మణి, కార్యకర్తలు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పేరాల(చీరాలటౌన్), ఏప్రిల్ 4 : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, ప్రధానోపధ్యాయులు సాల్మన్ రాజు అన్నారు. పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాలలో గురువారం ఏపీ నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో పర్యావరణ హిత జీవనశైలి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతినిధులు విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణకు సంబంధించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అలాగే చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, బాలశంకరరావు, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో


రికార్డులు పరిశీలిస్తున్న విజయ్మ

అద్దంకిటౌన్, ఏప్రిల్ 4: అద్దంకి మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (యూపీహెచ్‌సీ) కాకానిపాలెంను బాపట్ల డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వైద్యశాలలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే అద్దంకి భవానీ సెంటర్‌లో మురుగు కాలువలు, పారిశుధ్యం అధ్వానంగా ఉండడాన్ని మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాని తెలిపారు. ఆమె వెంట యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎం.హేమమాధురి, సిబ్బంది ఉన్నారు.

నేర నియంత్రణకు సహకరించండి : సీఐ


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చీరాలటౌన్, ఏప్రిల్ 4 : మీ పరిసరాలలో ఏదైనా అనుమానిత వ్యక్తులు లేక సమస్యలుంటే పోలీసులకు సమాచారం అందించి నేర నియంత్రణకు సహకరించాలని టూటౌన్ సీఐ సోమశేఖర్ పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలో ప్రత్యేక పోలీసు బలగాలు, స్టేషన్ సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎస్సై మురళి, పోలీసులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓటు వేయండి

ఇంకొల్లు, ఏప్రిల్ 4 : రానున్న ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఓటును వేయాలని ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు ఇంకొల్లు ఎస్ఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. గురువారం మండలంలోని పావులూరు, నాగండ్ల, ఇంకొల్లు గ్రామాలలో పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. గ్రామాలలో ఎటువంటి అంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ఓటును వినియోగించుకోవాలని మల్లికార్జునరావు సూచించారు. కార్యక్రమంలో కేంద్రబలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని సీఐ నరసింహారావు తెలిపారు. సంతమాగులూరు మండలం చవిటిపాలెం, తంగేడుమల్లి గ్రామాలలో గురువారం సీఐ పోలీసు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సంతమాగులూరు ఎస్ఐ సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

8న మాదిగ యువకుల సదస్సు


సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 4 : గుంటూరులో ఈనెల 8వ తేదీన జరిగే మాదిగ యువకుల రాష్ట్ర సదస్సుకు తరలిరావాలని ఎంఎస్‌పీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య కోరారు. గురువారం అద్దంకిలోని అంబేద్కర్ భవనంలో అద్దంకి నియోజకవర్గంలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరసయ్య మాదిగ మాట్లాడుతూ ఈ సదస్సుకు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాలు మద్దతు తెలిపిన నేపథ్యంలో అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగిపోగు చక్రవర్తి మాదిగ, పూనూరి నరేంద్రమాదిగ, ఆమోసు మాదిగ, పల్లెపోగు నాని మాదిగ, మారుతి ప్రసాద్, మహేంద్ర, పేతురు, రమేష్, శ్రీను, బాబు, దావీదు, ఎలీషా పాల్గొన్నారు.

నలుగురిపై కేసు

పర్చూరు, ఏప్రిల్ 4: అత్యాచారయత్నానికి పాల్పడిన నలుగురు వ్యక్తులపై గురువారం పర్చూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పోతుకట్ల ఎస్సీ కాలనీకి చెందిన ఇద్దరు వివాహితులపై కాలనీకి చెందిన నలుగురు అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. బహిర్భూమికి వెళ్లిన తరుణంలో ఆ నలుగుర వెంబడించినట్లు బాధితులు పేర్కొన్నారన్నారు. ఈఘటనలో ఒక మహిళకు గాయాలు కావడంతో చీరాల వైద్యశాలకు తరలించారు. ఆసుపత్రిలో మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.రమేష్ తెలిపారు.

బావపై తండ్రీకొడుకుల దాడి

గవినివారిపాలెం(చీరాలటౌన్), ఏప్రిల్ 4 : బావపై తండ్రి, కుమారుడు రాయితో దాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం రాత్రి మండల పరిధిలోని గవినివారిపాలెంలో జరిగింది. అందిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గవిని శ్రీనివాసరావుకు అదే ప్రాంతానికి చెందిన మద్దిబోయిన సోమయ్య సోదరితో వివాహం జరిగింది. ఈక్రమంలో వీరికి గతకొంత కాలంగా కుటుంబ కలహాలు సాగుతున్నాయి. ఇదిలావుండగా బుధవారం రాత్రి శ్రీనివాసరావు నూతన ఇంటిని నిర్మించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో చోటుచేసుకున్న ఘర్షణలో సోమయ్య, అతని కుమారుడు హరీష్ రాయితో దాడిచేయగా శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. దీం తో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందగా అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు సేకరించగా, ఈపూరుపాలెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జైభీం మాల ఉద్యోగుల కమిటీ ఎన్నిక

అద్దంకిటౌన్, ఏప్రిల్ 4 : అద్దంకి నియోజకవర్గ జై భీం మాల ఉద్యోగుల నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ గౌరవాధ్యక్షుడిగా గోపనబోయిన ఏడుకొండలు, గోగుల కోటేశ్వరరావు, అధ్యక్షుడిగా గోపతోటి శ్యాంసన్, ప్రధాన కార్యదర్శిగా యర్రమోతు ఆదినారాయణ, కోశాధికారిగా నూతలపాటి హనుమంతరావు సహాధ్యక్షుడిగా శ్రీనివాసరావు, శిరీష్, వరలక్ష్మి, సహా కార్యదర్శిగా టీ వెంకట్రావుతోపాటు మరి కొంత మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. జ్యోతీరావు పూలే, బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వంహించాని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కమిటీ కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.


శింగరకొండలో దర్శి టీడీపీ అభ్యర్థి డాక్టర్ లక్ష్మి

శింగరకొండలో టీడీపీ అభ్యర్థి లక్ష్మి పూజలు

అద్దంకి, ఏప్రిల్ 4 : దర్శి టీడీపీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి గురువారం దర్శి నియోజవర్గానికి వెళ్తూ శింగరకొండలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కోటప్పకొండలో పూజలు నిర్వహించిన గొట్టిపాటి లక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి శింగరకొండలో పూజలలో పాల్గొన్నారు. అనంతరం దర్శి నియోజకవర్గానికి బయలు దేరి వెళ్లారు.

విద్యుత్ మరమ్మతులకు రోటరీ సాయం


దాతలను సన్మానిస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 4 : అద్దంకిలోని ప్రభుత్వ వైద్యశాలలో ఇటీవల మరమ్మతులు చేపట్టారు. ఈక్రమంలో పశు వైద్యశాలలో విద్యుత్ మరమ్మతుల కోసం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో గురువారం వైద్యశాలలో విద్యుత్ మరమ్మతుల అనంతరం సౌకర్యాలను పరిశీలించారు. దాతలు గుండ్లకమ్మ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ డైరెక్టర్ పొల గంగు శ్రీనివాసరావు, నాదెండ్ల సుబ్బారావు రూ.15వేల ఆర్థిక సహకారంతో మరమ్మతు పనులు చేయించారు. ఈ సందర్భంగా వైద్యశాల ఏడీ డాక్టర్ మోహనరావు రోటరీ క్లబ్ సభ్యులను, ఆర్థక సహకారం అందించిన దాతలకు, మరమ్మతు పనులు దగ్గరుండి చేయించిన వారిని ఘనంగా సత్కరించారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చిన్ని మురళీకృష్ణ, సెక్రటరీ హరి బాబు, కొల్లా భువనేశ్వరి, మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, నర్రా శ్రీలక్ష్మి, మలాది శ్రీనివాసరావు, వైద్యశాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

CHAGANTI RAJYA LAKSHMI W/o. CHENCHURAMAIAH, 65 years, Jagarlamudi, Yaddana pudi Mandal, Bapatla district, previously CHAGANTI LUDHIYA now My Name IS CHAGANTI RAJYA LAKSHMI as per Aadhar Card, Postal premium and Passport in future reference hence forth vide affadavit. Date: 21-02-2024

ప్రచార జోరు.. టీడీపీ కేడర్‌లో జోష్

- ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న గొట్టిపాటి
- మరో వైపు తనయుడు హర్షవర్ధన్


ఎన్టీఆర్ నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి (ఫైల్)

అద్దంకి, ఏప్రిల్ 4 : అద్దంకి నియోజకవర్గ టీడీపీ కేడర్‌లో జోష్ పెరిగింది. ఒక వైపు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ రోజుకో గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నా రు. మరో వైపు రవికుమార్ పెద్దకుమారుడు హర్షవర్ధన్ సంతమాగులూరు మండలంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. నిత్యం జనంలో ఉంటూ జననేతగా ప్రత్యేక గుర్తింపు ఉన్న గొట్టిపాటి రవికుమార్ తరచూ ఏదోఒక కార్యక్రమం నిర్వహిస్తూ కేడర్‌లో నూనోత్సాహం నింపుతున్నారు. ఈక్రమంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో పక్కా ప్రణాళికతో ఎన్నికల ప్రచారం ప్రారంభించి మరింత స్పీడు పెంచారు. గ్రామాలవారీ సమీక్షలు నిర్వహించి కేడర్‌ను క్షేత్రస్థాయిలో సమాయత్తం చేసిన గొట్టిపాటి వారం రోజులుగా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ వైసీపీ వైఫల్యాలను ఎండగడుతున్నారు. టీడీపీ అధికారం చేపట్టిన తరువాత చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వవివరిస్తున్నారు. ఈ క్రమంలో సెంటిమెంట్‌గా నాలుగు విడతలలో తొలుత ఎన్నికల ప్రచారం ప్రారంభించిన విధంగానే ఈ విడత కూడా సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం నుంచే 5వ సారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న గొట్టిపాటి రవికుమార్ ఎన్నికల ప్రచారాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం వరుసగా రోజుకో మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఇప్పటికే అద్దంకి మండలం మణికేశ్వరం, బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు, అద్దంకి పట్టణంలోని 20వ వార్డు, పంగులూరు మండలం బూదవాడ లలో ఇంటింటి ఎన్నికల ప్రచారం పూర్తి చేశా రు. గురువారం రాత్రి కొరిశపాడు మండలం మేదరమెట్లలో ఇంటింటి ప్రచారం చేశారు. ఇం టింటి ఎన్నికల ప్రచారంలో గొట్టిపాటితో పాటు ఆ గ్రామ నేతలు, మండల నేతలు పెద్ద ఎత్తు న పాల్గొం టున్నారు. దీంతో ఇప్పటికే జోష్ మీ ద ఉన్న టీడీపీ కేడర్‌లో మరింత స్పీడు పెరిగింది. ఇక గొట్టిపాటి తనయుడు హర్షవర్ధన్ గత ఎన్నికల సమయంలోనే అడపాదడపా ప్రచారంలో పాల్గొనగా ప్రస్తుతం సంతమాగులూరు మండలంపై ప్రత్యేక దృష్టి సారించి ఇం టింటికీ వెళ్లి నాన్నను గెలిపించాలని అభ్యర్థిస్తు న్నారు. యువత ఆయనతో కలిసి ఉత్సాహంగా పాల్గొం టున్నారు. సంతమాగులూరు, బల్లికుర వ మండలాలు గతంలో మార్టూరు నియోజకవర్గ పరిధిలో ఉన్నప్పటి నుంచి గొట్టిపాటి కు టుంబానికి మంచి పట్టు ఉంది. ఈ నేప థ్యంలో పలువురు మండల, గ్రామ నేతలు గొట్టిపాటి కుటుంబంలో గొట్టిపాటి హనుమంతరావు, అనంతరం గొట్టిపాటి నర్సయ్య, గొట్టిపాటి రవికుమార్, ప్రస్తుతం గొట్టిపాటి హర్షవర్ధన్‌తో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇలా అద్దంకి నియోజకవర్గంలో టీడీపీ ఎన్నికల ప్రచారం పక్కా వ్యూహంతో ప్రత్యర్థులకు అందనంత స్పీడుతో ముందుకు సాగుతుంద న్న అభిప్రాయం కేడర్‌లో వ్యక్తమవుతుంది.

బల్లికురవ : మండలంలోని కొణిదెనలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం సాయంత్రం నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నారు.

యువతకు ఉద్యోగాల కల్పనలో వైసీపీ విఫలం

టీడీపీ యువ నేత హర్షవర్ధన్

సంతమాగులూరు : రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటులో, యువతకు ఉద్యోగాల కల్పనలో వైసీసీ ఘోరంగా విఫలమైందని టీడీపీ యువనేత గొట్టిపాటి హ ర్షవర్ధన్ తెలిపారు. కొప్పరం గ్రామంలో టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన తనయుడు హర్షవర్ధన్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ యువత భవిష్యత్‌ను జగన్‌రెడ్డి నాశనం చేశారన్నారు. అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాలు, ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ ఐదేళ్లుగా నిరుగ్యోగులను మోసగించారన్నారు. దీంతో 21,575 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి వెల్లడించారని ఇది వైసీపీ చేతకాని పాలనకు నిదర్శనమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తారని హర్షవర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు గాడిపర్తి వెంకట్రావు, దూపాటి ఏసోబు, తెలప్రోలు రమేష్, ఆలూరి శ్రీనివాసరావు, సన్నెబోయిన గురుయాదవ్, షేక్ మాబుసుభాని (బోడా), మస్తాన్‌వలి, పోలవరపు శింగరకొండ, గుంజి అంకమ్మరావు, కోటయ్య, అంగడి శివయ్య, బాషా, అనంతవరపు దేవా, సామ్రాట్, అట్లా పెద వెంకటరెడ్డి, పార్లమెంటు మహిళా కార్యదర్శి సుబాత, కే గోవిందమ్మ, శ్రీనివాసరావు, అయినాల గోపి, అయినాల మారుతి, మేకల ఆంనేయుయులు, చేవూరి వాసిరెడ్డి, కంచేటి మురళి, జనసేన మండల అధ్యక్షుడు జీ రామాంజి, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి చల్లా కృష్ణ, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న గొట్టిపాటి హర్షవర్ధన్

టీడీపీలోకి పెరుగుతున్న వలసలు

- విస్తృతంగా ఎన్నికల ప్రచారం
- కొండయ్యకు ప్రజాదరణ

చీరాల, ఏప్రిల్ 4 : టీడీపీలోకి రోజు, రోజుకు వలసలు పెరుగుతున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్యకు ఆదరణ పెరుగుతోంది. మండల పరిధిలోని కావూరివారి పాలెంకు చెందిన రెడ్డి సా మాజిక వర్గానికి చెందిన పలువురు స్థానిక టీ డీపీ కార్యాలయంలో కూటమి అభ్యర్థి కొండయ్యను కలసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కొండయ్య గెలుపునకు సైనికుల్లా పనిచేస్తామన్నారు. వారందరికీ కొండయ్య కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కొండయ్య కుమారుడు గౌరీ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణంలోని 21వ వార్డులో జరిగిన ఎన్నికల ప్రచారంలో కొండయ్యతో పాటు టీడీపీ, జనసేన, బీ జేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ సైకిల్ గు ర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సూ పర్‌సిక్స్, బీసీ డిక్లరేషన్ పథకాలను వివరించా రు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చేది కూటమి ప్రభుత్వమని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయి సమస్యలన్నీ పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో పార్టీల ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొండయ్యకు మద్దుతు తెలుపుతున్న కావూరివారిపాలెంవాసులు


చేనేత కార్మికుడితో మాట్లాడుతున్న కొండయ్య

ఓట్లన్నీ నీకే వేస్తాం మా సమస్యలు తీర్చండి

కొండయ్యతో నేతన్నల మనోభావాలు

వేటపాలెం(చీరాల) : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. మా ఓట్లన్నీ నీకే వేస్తాం.. మా సమస్యలు తీర్చండి అంటూ నేతన్న కొండయ్యను ఆశీర్వదిస్తూ స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని రామన్నపేట పంచాయతీ రావూరిపేటలో గురువారం రాత్రి ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కొండయ్య టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలసి సూపర్‌సిక్స్, బీసీ డిక్లరేషన్ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వ పాలనతో రాష్ట్రం అధోగతి పాలయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రతి ఒక్కరిరీ అభ్యర్థించారు. చంద్రబాబు మేనిఫెస్టో కరపత్రాలను కొండయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొగ్గుల పార్థసారధి, నాసిక వీరభద్రయ్య, యర్ర శివనాగమల్లేశ్వరి, తెలప్రోలు నాగేశ్వరరావు, ఎస్‌కే బాబు, కర్ల శ్రీను, జనసేన నాయకులు కారంపూడి పద్మిని, ఆర్కే నాయుడు, భాగ్యలక్ష్మీ,కాలిక, సాయి, బీజేపీ ప్రతినిధులు నాసిక శివాజీ, షేక్ కరిముల్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.